



# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY






SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 243 | తూర్పుగోదావరి జిల్లా | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | సోమవారం 25 మే 2026 | పేజీలు : 12 | వెల : 2/-


జగన్ మళ్లీ సీఎం అవుతారని చంద్రబాబుకు

## భయం పట్టుకుంది

— అంబటి రాంబాబు —



**తాడేపల్లి, విశ్వం వాయిస్ న్యూస్ :** కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత తీవ్రస్థాయిలో పెరిగిందని, దాని నుంచి దృష్టి మళ్లించేందుకే సీఎం చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు మిగతా .. 2లో..

కాలినడకన తిరుమల చేరుకున్న

## రామ్మోహన్ నాయుడు దంపతులు




**తిరుమల, విశ్వం వాయిస్ న్యూస్ :** కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు దంపతులు కాలినడకన తిరుమలకు చేరుకున్నారు. కుమారుడు శివాన్ ఎర్రన్నాయుడి పుట్టువెంట్రుకల మొక్కు సందర్భంగా సతీమణి శ్రావ్యతో కలిసి శ్రీవారి దర్శనానికి వచ్చారు. అలిపిరి మెట్ల మార్గంలో మిగతా .. 2లో..

పాపికొండలు విహారయాత్ర.. పర్యాటక బోటుకు

## తప్పిన పెను ప్రమాదం

38 మంది పర్యాటకులను మరో బోటులో పంపిన అధికారులు



**దేవీపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** పోలవరం జిల్లాలో పాపికొండలు విహారయాత్రకు ఆదివారం ఉదయం బయలుదేరనున్న ఏపీ టీడీసీ బోటులో నీరు చేరడాన్ని గుర్తించిన సిబ్బంది వెంటనే అప్రమత్తం కావడంతో పెను ప్రమాదం తప్పింది. పోలవరం జిల్లా దేవీపట్నం మండలం గండి పోశమ్మ ఆలయం వద్ద పర్యాటక అభివృద్ధి సంస్థకు చెందిన మిగతా .. 2లో..

ఎబోలాపై ఏపీ ప్రభుత్వం దృష్టి..

## విమానాశ్రయాల్లో ప్రత్యేక నిఘా

ఆఫ్రికా దేశాల్లో వేగంగా పెరుగుతున్న ఎబోలా కేసులు



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆఫ్రికా దేశాలలో ఎబోలా వైరస్ కేసులు వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్రమత్తమైంది. వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ రంగంలోకి మిగతా .. 2లో..

# నిప్పుల కొలిమిలా ఆంధ్రప్రదేశ్..



- తూర్పుగోదావరి జిల్లా చిట్యాలలో 48.3 డిగ్రీల రికార్డు ఉష్ణోగ్రత నమోదు
- రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో 44 డిగ్రీలు దాటిన పగటి ఉష్ణోగ్రతలు
- మరో 3 రోజుల పాటు తీవ్ర వడగాల్పులు తప్పవని ఏపీఎస్డీఎంఏ హెచ్చరిక
- సోమవారం 29 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, 166 మండలాల్లో వడగాల్పుల అంచనా
- కొన్ని జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలకు అవకాశం ఉందని వెల్లడి

**విశ్వం వాయిస్ న్యూస్ :**

**తెలుగు రాష్ట్రాల్లో ఎండల తీవ్ర కొనసాగుతుండంతో ఆంధ్రప్రదేశ్ నిప్పుల కొలిమిలా మారింది. దీంతో ప్రజలంతా ఎండ తీవ్రతను తట్టుకోలేక ఉక్కిరిబిక్కిరైపోతున్నారు.**

ఆంధ్రప్రదేశ్‌లో భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తూ రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలను నమోదు చేస్తున్నాడు. ఆదివారం మిగతా .. 2లో..

# ఎబోలా గుబులు..

పబ్లిక్ హెల్త్ ఎమర్జెన్సీగా ప్రకటించిన డబ్ల్యూహెచ్‌వో




**విశ్వం వాయిస్ న్యూస్ :** ఈశాన్య కాంగోలోని ఇటూరి ప్రావిన్స్‌లో ఎబోలా వేగంగా వ్యాపిస్తోంది. రోజు రోజుకూ మృతుల సంఖ్య పెరుగుతుండటంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ బుండిబుగ్యో ఎబోలాను అంతర్జాతీయ స్థాయిలో ఆందోళనకరమైన పబ్లిక్ హెల్త్ ఎమర్జెన్సీగా ప్రకటించింది. ప్రస్తుతం కాంగో, ఉగాండ, దక్షిణ సూడాన్‌లలో వ్యాప్తి తీవ్రత ఎక్కువగా ఉన్నట్లు వెల్లడించింది. మరోవైపు భారత ప్రభుత్వం కూడా బుండిబుగ్యో ఎబోలాపై అప్రమత్తమైంది. ప్రజలు అత్యవసరమైతే తప్ప కాంగో, ఉగాండా, దక్షిణ సూడాన్ దేశాలకు ప్రయాణించవద్దని హెల్త్ అడ్వైజరీ జారీ చేసింది. శనివారం నాటికి కాంగోలో మొత్తం 867 మందికి ఈ వ్యాధి వ్యాపించగా.. 204 మరణాలు నమోదయ్యాయి.

**చరిత్రలో మూడో అతిపెద్ద ఎబోలా వ్యాప్తిగా..**

కేవలం వారాల వ్యవధిలోనే మూడు దేశాలకు పాకిన ఎబోలా వందల మందికి సోకింది. భౌగోళికంగా కూడా ఈ వ్యాధి వ్యాపించిన ప్రదేశంలో కట్టడి చేయడం చాలా కష్టమని అంతర్జాతీయ ఆరోగ్య నిపుణులు ఆందోళన వ్యక్తం మిగతా .. 2లో..

ఇది జగన్

# వంకర బుద్ధికి నిదర్శనం



- విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ రద్దు కాలేదని ప్రభుత్వం స్పష్టీకరణ
- పశ్చిమాసియా యుద్ధం కారణంగా నెలరోజులు ఆలస్యం
- పాఠశాలలు తెరిచేనాటికి పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ
- యూనిఫాం, బూట్లు, బ్యాగ్‌ల సరఫరాకు కొంత సమయం
- వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోందన్న మంత్రి నారా లోకేష్

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లను పూర్తిగా నిలిపివేసిందంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తీవ్రంగా ఖండించారు. ఈ ప్రచారం వందశాతం అవాస్తవమని, కిట్ల పంపిణీని ఆపే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని ఆయన స్పష్టం చేశారు. కేవలం కొన్ని అంతర్జాతీయ కారణాల వల్ల కిట్ల సరఫరాలో సుమారు నెల రోజుల జాప్యం జరుగుతోందని తెలిపారు. ప్రభుత్వం నిజాయతీగా జాప్యం గురించి వెల్లడిస్తే, దానిని వక్రీకరించి అసలు కిట్లే ఇవ్వరంటూ వైసీపీ పార్టీ విష ప్రచారం చేస్తోందని ఆయన ఆరోపించారు. ఇది జగన్ రెడ్డి వంకర బుద్ధికి నిదర్శనమని విమర్శించారు. పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితుల కారణంగా ముడిసరుకుల ధరలు పెరగడం, రవాణాకు ఆటంకాలు ఏర్పడటంతో యూనిఫాం క్లాత్, బూట్లు, బ్యాగుల సరఫరా ఆలస్యమవుతోందని విద్యాశాఖ అధికారులు తెలిపినట్లు మిగతా .. 2లో..

రాజమహేంద్రవరంలో డిప్యూటీ సీఎం


# పవన్ కళ్యాణ్ పర్యటన

ఘనస్వాగతం పలికిన మంత్రి కందుల దుర్గేష్, జిల్లా కలెక్టర్, ఎస్పీ





**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ అధికారిక పర్యటన నిమిత్తం రాజమహేంద్రవరం చేరుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక హోటల్ షెల్టన్ వద్ద రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కందుల దుర్గేష్ ఆయనకు పుష్పగుచ్ఛం అందించి, ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ సోమవారం రాజమహేంద్రవరంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పలు కీలక అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు. రాబోయే గోదావరి పుష్కరాలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించేలా, పుష్కర ఘాట్ల వద్ద జరుగుతున్న వివిధ పనులను ఉప ముఖ్యమంత్రి స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారన్నారు. అదేవిధంగా పుష్కరాల ఏర్పాట్లు, మౌలిక వసతుల మిగతా .. 2లో..



తిరుమలలో విపరీతమైన

## భక్తుల రద్దీ

శ్రీవారి సర్వదర్శనానికి దాదాపు 30 గంటల సమయం బాట గంగమ్మ ఆలయం వరకు చేరిన క్యూలైన్లు నిండిపోయిన వైకుంఠం క్యూ కాంప్లెక్స్, నారాయణగిరి షెడ్లు

**తిరుమల, విశ్వం వాయిస్ న్యూస్ :** కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవెంకటేశ్వర స్వామి కొలువైన తిరుమల క్షేత్రంలో విపరీతమైన రద్దీ నెలకొంది. శ్రీవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. యాత్రికుల రద్దీ అనూహ్యంగా పెరగడంతో వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు, నారాయణగిరి షెడ్లు పూర్తిగా నిండిపోయాయి. దీంతో క్యూలైన్లు మిగతా .. 2లో..

ప్రొఫెసర్ నాగేశ్వర్‌పై

## కేసులు తక్షణమే ఎత్తివేయండి

ఏపీ ప్రభుత్వానికి హరీశ్ రావు విజ్ఞప్తి



**తెలంగాణా, విశ్వం వాయిస్ న్యూస్ :** జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, కూటమి ప్రభుత్వంపై ప్రముఖ రాజనీతి విశ్లేషకుడు ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ చేసిన వ్యాఖ్యలు రెండు తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర రాజకీయ దుమారం రేపిన సంగతి మిగతా .. 2లో..




(మొదటిపేజీ తరువాయి)

## నిప్పుల కొలిమిలా ఆంధ్రప్రదేశ్

తూర్పుగోదావరి జిల్లా చిట్యాల వద్ద ఈ సీజన్‌లోనే అత్యధికంగా 48.3 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు తీవ్రమైన ఎండలు, ఉక్కపోతతో అల్లాడిపోతున్నారు. రాబోయే మూడు రోజుల పాటు ఇదే తీవ్రత కొనసాగుతుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) హెచ్చరించింది. ఆదివారం పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 44 డిగ్రీల మార్కును దాటాయి. తూర్పుగోదావరి జిల్లాలోని గోపాలపురంలో 48.3, ఉండ్రాజవరంలో 48.1 డిగ్రీలు నమోదవగా, పశ్చిమ గోదావరి జిల్లాలోని అత్తిలి, ఇరగవరం, తణుకులో 48.1 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. పల్నాడు జిల్లా పిడుగురాళ్లలోనూ 48.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఏలూరు జిల్లా కుక్కునూరులో 47.3, కృష్ణా జిల్లా నందివాడలో 47.1 డిగ్రీల తీవ్రత కనిపించింది. వీటితో పాటు కోనసీమ, కాకినాడ, ఎన్టీఆర్, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లోని అనేక మండలాల్లో 44 నుంచి 47 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. బాపట్ల జిల్లా నిజాంపట్నంలో 46.2, కాకినాడ జిల్లా కాజులూరులో 46.5, ఎన్టీఆర్ జిల్లా మైలవరంలో 45.7 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు రికార్డవ్వడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. సోమవారం (మే 25) కూడా ఎండల తీవ్రత కొనసాగుతుందని వాతావరణ శాఖ అంచనా వేసింది. రాష్ట్రంలోని 29 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, 166 మండలాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని తెలిపింది. ముఖ్యంగా కోనసీమ, గోదావరి జిల్లాలు, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 45 నుంచి 47 డిగ్రీల వరకు చేరవచ్చని హెచ్చరించింది. విజయనగరం, మన్యం, కాకినాడ, మార్కాపురం, నెల్లూరు జిల్లాల్లో 43 నుంచి 45 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. ఒకవైపు ఎండలు మండిపోతున్నా, మరోవైపు ద్రోణి ప్రభావంతో కొన్ని ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. మార్కాపురం, ప్రకాశం, కర్నూలు, నంద్యాల, అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడొచ్చని సూచించింది. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయటకు వెళ్లవద్దని అధికారులు సూచించారు. ఉరుములు, మెరుపులతో వర్షం పడే సమయంలో చెట్ల కింద, విద్యుత్ స్తంభాల సమీపంలో నిలబడరాదని హెచ్చరికలు జారీ చేశారు.

## ఎబోలా గుబులు...

చేస్తున్నారు. ఈశాన్య కాంగోలోని యుద్ధ ప్రభావిత ప్రాంతమైన ఉగాండా సరిహద్దుల్లో తొలి ఎబోలా కేసు నమోదైంది. అక్కడ ఒక హెల్త్ వర్కర్ వాంతులు, జ్వరంతో చికిత్స తీసుకొని కొన్ని రోజుల్లోనే మరణించారు. ఆ తర్వాత ఆ మృతదేహాన్ని అంత్యక్రియల కోసం ఇంటికి తరలించారు. దానిని తాకిన చాలా మందికి కొన్నాళ్లకే ఎబోలా లక్షణాలు బయటపడ్డాయి. వైరస్ సోకిన వారికి కొన్ని వారాలపాటు వ్యాధి లక్షణాలు బయటపడకపోవడంతో ఎక్కువ మందికి సోకే అవకాశం కలుగుతోంది. వ్యాధి వ్యాపించిన ప్రదేశం కాంగోలో ప్రధాన మైనింగ్ కేంద్రం కావడంతో జనాభా రద్దీ అధికంగా ఉంటుంది. దీంతో 2018లో ఎబోలా వ్యాపించిన సమయంలో దానిని కట్టడి చేయడానికి ఏకంగా రెండేళ్ల సమయం పట్టింది.

**అరుదైన రకం కావడం కూడా..**

మనుషులకు సోకే నాలుగు రకాల ఎబోలా వైరస్‌ల్లో బుండిబుగ్యో ఒకటి. దీనిని ఉగాండాలోని ఓ పర్వత ప్రాంతంలో తొలిసారి కనుగొన్నారు. గతంలో రెండుసార్లు మాత్రమే వ్యాపించడంతో అధికారులు పెద్దగా దృష్టిపెట్టలేదు. ఫలితంగా తాజాగా వ్యాపించిన ప్రదేశంలోని ల్యాబ్ పరీక్షల్లో దీనిని గుర్తించే సౌకర్యం లేకపోవడంతో.. గుర్తించేందుకు జాప్యం జరిగింది. మొదట దీనిని గుర్తించేందుకు నమూనాను వేల మైళ్ల దూరంలో ఉన్న గవర్నమెంట్ రీసెర్చ్ ల్యాబ్‌కు పంపాల్సి వచ్చింది. ఎబోలాలో జైర్ అనే స్ట్రెయిన్ అత్యంత వేగంగా వ్యాపిస్తుంది. దీంతో పోలిస్తే బుండిబుగ్యో ఎబోలా వైరస్ కొంచెం నెమ్మదిగానే తన సంఖ్యను పెంచుతుందని పరిశోధనలు చెబుతున్నాయి. పశ్చిమాఫ్రికా ప్రాంతంలో 2014లో 11,300 మంది ప్రాణాలు తీసింది జైర్ వేరియంట్. ఇది చరిత్రలోనే అతిపెద్ద ఎబోలా వ్యాప్తి. దీంతో పోలిస్తే బుండిబుగ్యో వేరియంట్ సోకిన వారిలో 30% మంది మాత్రమే ప్రాణాలు కోల్పోయారు. కాకపోతే దీనికి ఇప్పటి వరకు ఎటువంటి వ్యాక్సిన్, చికిత్స లేకపోవడం ఇబ్బందికరంగా మారింది.

## చంద్రబాబుకు భయం పట్టుకుంది

మండిపడ్డారు. తాడేపల్లిలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... జగన్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారనే భయం చంద్రబాబుకు పట్టుకుందని, అందుకే నిరంతరం వైసీపీపై బురదజల్లడమే పనిగా పెట్టుకున్నారని ధ్వజమెత్తారు. వైఎస్ కుటుంబానికి పులివెందులలో ఎన్నడూ ఓడిపోయిన చరిత్ర లేదని ఆయన గుర్తుచేశారు. చంద్రబాబు నియంతలా రాష్ట్రాన్ని పాలిస్తున్నారని, అధికారంలోకి వచ్చాక రూ.3.5 లక్షల కోట్లు అప్పు తెచ్చిన కూటమి ప్రభుత్వం ఆ నిధులతో రాష్ట్రానికి ఏం చేసిందని అంబటి ప్రశ్నించారు. వైసీపీని తిట్టడం తప్ప వీరికి పాలన చేతకావడం లేదన్నారు. రాష్ట్రంలో పంటలకు గిట్టుబాటు ధర లేదని... మొక్కజొన్న ధరలపై ప్రశ్నిస్తే గోడౌన్లపై దాడులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ యుద్ధాల నెపంతో పెరిగిన నిత్యావసరాల ధరలను తగ్గించి ప్రజలపై భారం పడకుండా చూసే కనీస ప్రయత్నం కూడా ప్రభుత్వం చేయడం లేదని, చంద్రబాబు, లోకేష్ కలిసి రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని అంబటి రాంబాబు ఆరోపించారు.

## రామ్మోహన్ నాయుడు దంపతులు

ఉదయం 11 గంటలకు నడక ప్రారంభించిన రామ్మోహన్‌నాయుడు దంపతులు.. మధ్యాహ్నం 2 గంటలకు కొండపైకి చేరుకున్నారు. సతీమణితో కలిసి 1000మెట్లకు పైగా బొట్లు పెడుతూ రామ్మోహన్‌నాయుడు కొండపైకి వచ్చారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ నడకదారిలో వెళ్లే భక్తులకు తితిదే విస్తృత ఏర్పాట్లు చేసిందన్నారు. తిరుమలలోని సదుపాయాలే కూటమి ప్రభుత్వ పనులకు ఉదాహరణ అని చెప్పారు. ఏపీలో సనాతన ధర్మవ్యాప్తికి, సంప్రదాయాల పరిరక్షణకు విశేష కృషి జరుగుతోందన్నారు. శ్రీవారిని రామ్మోహన్‌నాయుడు కుటుంబసభ్యులు సోమవారం దర్శించుకోనున్నారు.

## పర్యాటక బోటుకు తప్పిన పెను ప్రమాదం

బోటుకు ముందు భాగంలో స్వల్ప పగులు చోటుచేసుకుని నీరు లోపలికి చేరింది. 40 మంది సామర్థ్యమున్న ఈ బోటు నిత్యం పర్యాటకులతో తిరుగుతుంటుంది. పాపికొండలు విహారయాత్రకు ఏపీటీడీసీ బోటులో వెళ్లేందుకు 38 మంది ఆన్‌లైన్‌లో టికెట్లు బుకింగ్ చేసుకున్నారు. వారంతా ఆదివారం ఉదయం గండిపోశమ్మ ఆలయం వద్ద బోటు పాయింట్‌కు చేరుకున్నారు. ఉదయం బయలుదేరడానికి రెండు గంటల ముందు బోటు ఊగకుండా బరువెక్కడాన్ని (నీటిలో కిందకు దిగి ఉండడం) సిబ్బంది గమనించారు. బోటు లోపల భాగంలో ఉన్న కానులను పరిశీలించగా క్రమంగా నీరు చేరుతున్న విషయాన్ని గుర్తించారు. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది బోటులోకి చేరిన నీటిని బయటకు తోడిపోశారు. సమాచారాన్ని ఉన్నతస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో బోటును నిలిపివేసి 38 మంది పర్యాటకులను విజయగంగ బోటులో పాపికొండల విహారయాత్రకు పంపించారు.

**బోటు ముందు భాగంలో స్వల్ప పగుళ్లు**

ఏపీటీడీసీ బోటు ముందు భాగంలో (మాకు) వద్ద జాయింట్‌లో చిన్నపాటి పగులు రావడంతో స్వలంగా బోటులోకి నీరు చేరిందని జలవనరుల శాఖ ఏఈ భాస్కర్ తెలిపారు. నీరు చేరిన విషయాన్ని ముందుగానే గమనించడంతో పర్యాటకులను బోటుపైకి రానివ్వలేదన్నారు. వారందరినీ మరో బోటులో పాపికొండల విహారయాత్రకు పంపించామన్నారు. మరమ్మతులు పూర్తయ్యేవరకు విహారయాత్రకు అనుమతించబోమని చెప్పారు. శనివారం ఈ బోటు 39 మంది పర్యాటకులతో విహారయాత్రను ముగించుకుని సురక్షితంగా ఒడ్డుకు చేరింది. రాత్రి పగులు వచ్చి, ఉదయానికి బోటులోకి నీరు చేరి ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు.

## విమానాశ్రయాల్లో ప్రత్యేక నిఘా

దిగింది. ముఖ్యంగా ఆఫ్రికాలోని కాంగో, ఉగాండా, సూడాన్ వంటి దేశాల నుంచి ఆంధ్రప్రదేశ్‌కు వచ్చే ప్రయాణికులకు విమానాశ్రయాల్లోనే ముందస్తు వైద్య పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలోని అంతర్జాతీయ ప్రయాణాలు జరిగే విశాఖపట్నం, తిరుపతి, విజయవాడ విమానాశ్రయాలపై వైద్యారోగ్య శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఈ వ్యవహారంపై అన్ని జిల్లాల అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఎబోలా వైరస్ నియంత్రణకు అవసరమైన అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కేవలం విమానాశ్రయాలే కాకుండా, రాష్ట్రంలోని ప్రధాన ఓడరేవులు, అలాగే పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చే రోడ్డు మార్గాల్లోనూ నిఘా ఉంచాలని మంత్రి ఆదేశించారు. ప్రయాణికులలో ఎవరికైనా ఎబోలా వైరస్ లక్షణాలు కనిపిస్తే, వారిని తక్షణమే ఐసోలేట్ చేసి క్వారంటైన్‌కు తరలించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రి సత్యకుమార్ వెల్లడించారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అయితే అప్రమత్తంగా ఉండటం అవసరమని అధికారులు పేర్కొంటున్నారు.

### రాజమహేంద్రవరంలో డిప్యూటీ సీఎం

## పవన్ కళ్యాణ్ పర్యటన

కల్పనపై వివిధ శాఖల అధికారులతో డిప్యూటీ సీఎం ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహిస్తారని పేర్కొన్నారు. గోదావరి నది పవిత్రతను కాపాడుతూ, కాలుష్య నివారణకు తీసుకోవాల్సిన తక్షణ, దీర్ఘకాలిక చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేయనున్నారని అన్నారు. నగర పరిధిలో చేపట్టాల్సిన పలు ఇతర అభివృద్ధి పనుల్లో కూడా ఉప ముఖ్యమంత్రి పాల్గొంటారని తెలిపారు. రాజమండ్రి ప్రాధాన్యతను, భక్తుల సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని ఈ పర్యటన అత్యంత ప్రాధాన్యత సంతరించుకుందని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు.

## తిరుమలలో విపరీతమైన భక్తుల రద్దీ

బయటకు ఏకంగా బాట గంగమ్మ ఆలయం వరకు పొడిగించారు. సర్వదర్శనం టోకెన్లు లేని భక్తులకు శ్రీవారి దర్శనానికి దాదాపు 24 నుంచి 30 గంటల సమయం పడుతున్నట్లు అధికారులు తెలిపారు. వేసవి సెలవులు, వారాంతం కావడంతో భక్తులు భారీ సంఖ్యలో తిరుమలకు తరలివచ్చారు. రద్దీ తీవ్రతకు అనుగుణంగా టీటీడీ అధికారులు భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు చేపడుతున్నారు. క్యూలైన్లలో వేచి ఉన్నవారికి తాగునీరు, అల్పాహారం వంటివి అందిస్తున్నారు. టీటీడీ గణాంకాల ప్రకారం, నిన్న మే 23వ తేదీ శనివారం ఒక్కరోజే రికార్డు స్థాయిలో 97,561 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. 57,780 మంది యాత్రికులు తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అదే రోజున శ్రీవారి హుండీకి రూ. 3.76 కోట్ల ఆదాయం వచ్చినట్లు తిరుమల తిరుపతి దేవస్థానం వెల్లడించింది.

### ఇది జగన్

## వంకర బుద్ధికి నిదర్శనం

లోకేష్ వివరించారు. అయితే, జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభమయ్యే నాటికి విద్యార్థులందరికీ పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ కచ్చితంగా అందజేస్తామని హామీ ఇచ్చారు. మిగిలిన వస్తువులను కూడా వీలైనంత త్వరగా పంపిణీ చేసేందుకు అధికారులు తయారీ సంస్థలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నారని లోకేష్ పేర్కొన్నారు.

### ప్రొఫెసర్ నాగేశ్వర్‌పై

## కేసులు తక్షణమే ఎత్తివేయండి

తెలిసిందే. వైసీపీ అధినేత జగన్‌ను అరెస్ట్ చేయాలంటూ పవన్ కల్యాణ్ కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కోరినట్టు... జగన్ మనకు లాంగ్ టైమ్ ఫ్రెండ్, ఆయనతో స్నేహంగా ఉండాలని పవన్ కు అమిత్ షా చెప్పినట్టు ప్రొఫెసర్ నాగేశ్వర్ చేసిన కామెంట్స్‌ను జనసేన పార్టీ తీవ్రంగా తప్పుబట్టింది. ఆయన వైసీపీకి తొత్తుగా మారి అవాస్తవాలు మాట్లాడుతున్నారంటూ సోషల్ మీడియాలో జనసైనికులు పెద్ద ఎత్తున విమర్శలు గుప్పించడమే కాకుండా, ఏపీలోని పలు పోలీస్ స్టేషన్లలో ఆయనపై ఫిర్యాదులు చేయడంతో కేసులు కూడా నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో, తీవ్ర ఒత్తిడి ఎదుర్కొన్న ప్రొఫెసర్ నాగేశ్వర్, తాను చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్లు బేషరతుగా ప్రకటించారు. అయినప్పటికీ ఆయనపై నమోదైన కేసులను ఏపీ పోలీసులు ఇంకా కొనసాగిస్తుండడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై తాజాగా తెలంగాణ మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు స్పందించారు. ఎక్స్ వేదికగా ఆయన ఏపీ ప్రభుత్వ తీరును తప్పుబడుతూ ఒక పోస్ట్ చేశారు. ప్రొఫెసర్ నాగేశ్వర్ తన వ్యాఖ్యలను బేషరతుగా ఉపసంహరించుకున్నట్లు ప్రకటించిన తర్వాత కూడా, కక్షపూరిత ధోరణితో ఆయనపై కేసులు నమోదు చేసి వేధించడం ఎంతమాత్రం సరికాదని హరీశ్ రావు హితవు పలికారు. భావప్రకటనా స్వేచ్ఛను గౌరవించాలని, ప్రొఫెసర్‌పై పెట్టిన అన్ని కేసులను ఏపీ ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. హరీశ్ రావు చేసిన ఈ ట్వీట్‌పై ఏపీ ప్రభుత్వం, జనసేన శ్రేణులు ఎలా స్పందిస్తాయో వేచి చూడాలి.

### వెన్నుపోటు పొడిచిన కాంగ్రెస్‌ను

## ఎన్నటికీ నమ్మలేం

### డీఎంకే నేత ఉదయనిధి స్టాలిన్




**విశ్వం వాయిస్ న్యూస్ :** డీఎంకే నేత ఉదయనిధి స్టాలిన్ కాంగ్రెస్ పార్టీపై తీవ్ర విమర్శలు చేశారు. రాజకీయ లబ్ధి కోసం ఆ పార్టీ తమను వెన్నుపోటు పొడిచిందని దుయ్యబట్టారు. గత 20ఏళ్లుగా ఆ పార్టీ తమపై ఆధారపడి ఉందని.. ఈ రోజు అధికారం కోసం టీవీకేతో చేతులు కలిపిందని విమర్శించారు. ఈ విషయాన్ని ఎవరూ ఎప్పటికీ మర్చిపోవద్దని.. ఆ పార్టీ నేతలను భవిష్యత్తులో తమ దరిదాపుల్లోకి కూడా రానివ్వకూడదని సూచించారు. రాజకీయంగా తన ఉనికిని నిలుపుకోవడానికి కాంగ్రెస్ ఎంతటి దారుణానికి అయినా ఒడిగడుతుందని మరోసారి రుజువయ్యిందన్నారు. దేశంలో భాజపా వరుస విజయాలకు ప్రధాని మోదీ, అమిత్ షాలే ప్రధాన కారణమని తాను ఇన్నాళ్లు భావించానని.. కానీ అది నిజం కాదని ఉదయనిధి అన్నారు. కాంగ్రెస్ నేతల అసమర్థత వల్లే ప్రజలు భాజపాకు పట్టం కడుతున్నారని.. అది ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తోందని పేర్కొన్నారు. డీఎంకేతో పొత్తు వల్లే గతంలో కాంగ్రెస్‌కు రాజ్యసభ ఎంపీ, అసెంబ్లీ సీట్లు వచ్చాయన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో కూడా డీఎంకే కార్యకర్తల అవిశ్రాంత కృషి వల్లే ఆ పార్టీ ఐదు సీట్లు గెలుచుకోగలిగిందన్నారు. ఆ విశ్వాసం కూడా లేకుండా కాంగ్రెస్ నేతలు గెలిచిన వెంటనే అధికారం కోసం పరుగులు తీశారని మండిపడ్డారు. త్వరలోనే తమిళనాడు ప్రజలు కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెబుతారని అన్నారు. ఎన్నికల్లో డీఎంకే పరాజయం నేపథ్యంలో అంతర్గత పార్టీ వ్యూహాల్లో దిద్దుబాటు చర్యలు చేపట్టాలని కార్యకర్తలకు సూచించారు.

### అమెరికా చేసుకున్న

## చెత్త ఒప్పందం అదే

### అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్


**విశ్వం వాయిస్ న్యూస్ :** అమెరికా చేసుకున్న అత్యంత చెత్త ఒప్పందాల్లో ఇరాన్ అణు



ఒప్పందం ఒకటని ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. దానిని ఒబామా, ఆయన యంత్రాంగంలోని అను భవం లేని అధికారులు ప్రతిపాదించి, అమలు లోకి తెచ్చారని విమర్శిం చారు. ఇరాన్ అణ్వాయుధాన్ని అభివృద్ధి చేసుకునే ప్రయత్నాలకు అది వీలు కల్పించిందన్నారు. తమ హయాంలో ప్రస్తుతం ఇరాన్‌తో జరుపుతున్న ఒప్పందం విషయంలో అలాంటి తప్పిదం జరగదని ట్రంప్ స్పష్టం చేశారు. చర్చలు క్రమబద్ధంగా, నిర్మాణాత్మకంగా సాగుతున్నాయన్నారు. ఒప్పందం విషయంలో తొందరపడొద్దని తమ ప్రతినిధులకు స్పష్టంగా చెప్పినట్లు ట్రంప్ వెల్లడించారు. ఒప్పందం కుదిరి, అంగీకరించి, ఇరుపక్షాలు సంతకాలు చేసే వరకు హర్మూజ్ దిగ్బంధనం పూర్తి స్థాయిలో అమల్లో ఉంటుందన్నారు. పొరపాట్లకు తావులేకుండా.. సమయం తీసుకొని ఇరుపక్షాలు సరిగ్గా ఒప్పందం చేసుకోవాల్సి ఉందని ట్రంప్ పేర్కొన్నారు. ఇరాన్‌తో తమ బంధం ప్రొఫెషనల్‌గా, మరింత ఉత్పాదకంగా మారుతోందన్నారు. అయినప్పటికీ.. అణ్వాయుధాన్ని అభివృద్ధి చేసుకోలేరని లేదా సమకూర్చుకోలేరనే విషయాన్ని వాళ్లు (ఇరాన్) అర్థం చేసుకోవాలన్నారు. ఇప్పటివరకు తమకు మద్దతు తెలిపిన, సహకారం అందించిన పశ్చిమాసియా దేశాలకు ధన్యవాదాలు తెలియజేయాలనుకుంటున్నట్లు ట్రూత్ సోషల్ వేదికగా ట్రంప్ పేర్కొన్నారు.

## 'మరికొన్ని గంటల్లో గుడ్ న్యూస్'

### మార్కో రూబియో కీలక వ్యాఖ్యలు



**విశ్వం వాయిస్ న్యూస్ :** ఇరాన్‌తో శాంతి ఒప్పందానికి సంబంధించి అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో కీలక వ్యాఖ్యలు చేశారు. మరికొన్ని గంటల్లో ఇరాన్‌కు సంబంధించి శుభవార్త వింటారని చెప్పారు. భారత పర్యటనలో ఉన్న ఆయన.. విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్‌తో కలిసి సంయుక్త మీడియా సమావే శంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా హర్మూజ్ జలసంధి సమస్యను పరిష్కరించే ప్రతిపాదనలపై గత 48 గంటల్లో కొంత పురోగతి వచ్చిందన్నారు. త్వరలో ఇరాన్‌తో ఒప్పందం కుదిరేందుకు అవకాశ ముందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెప్పిన కొన్ని గంటల్లోనే రూబియో ఈ వ్యాఖ్యలు చేశారు.

**భారత్‌తో బంధం బలోపేతం..**

భారత్, అమెరికా మధ్య సంబంధాలు ఏ మాత్రం తగ్గలేదని.. రానున్న రోజుల్లో ఇవి మరింత బలపడతాయని మార్కో రూబియో ఆశాభావం వ్యక్తం చేశారు. ఇరు దేశాల మధ్య చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న వాణిజ్య ఒప్పందం త్వరలోనే ఖరారవుతుందని ఆశిస్తున్నామని అన్నారు. ప్రపంచం ఎదుర్కొంటున్న దాదాపు అన్ని సమస్యలపై ఇరు దేశాలు వ్యూహాత్మకంగా ఒకే విధంగా ఆలోచిస్తున్నాయని అన్నారు. భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ మాట్లాడుతూ.. నిరాటంకమైన సముద్ర వాణిజ్యానికి భారత్ కట్టుబడి ఉందన్నారు. పశ్చిమాసియాతోపాటు భారత్, తూర్పు ఆసియా పరిస్థితులపై అమెరికా మంత్రితో చర్చించామన్నారు. ఇంధన రంగంలో ఇటీవల ఇరుదేశాలు సహకారాన్ని ఇరువురం స్వాగతించామని జైశంకర్ పేర్కొన్నారు.

# ఎడిటర్ వాయిస్

## వైసీపీలో సర్వేల కలవరం సీటు విషయమేంటి?

వైసీపీకి 2024 ఎన్నికలు అనేక విధాలుగా దెబ్బ తీసిన సంగతి తెలిసిందే. ఈ ఎన్నికలు ఇచ్చిన షాకులు చెప్పిన గుణ పాఠాలు చాలానే ఉన్నాయి. వైసీపీకి చెందిన సిట్టింగులను అలా మార్చుకుంటూ పోయారు. మంత్రుల నుంచి ఎమ్మెల్యేల నుంచి సీనియర్ల నుంచి ఎవరినీ వదలేదు. అలా దాదాపుగా వంద దాకా అసెంబ్లీ నియోజకవర్గాలలో సిట్టింగులను భారీగా చేంజ్ చేయడం వల్ల వైసీపీ చివరికి ఇబ్బందుల పాలు అయింది. లాస్ట్ మినిట్ లో కొత్త చోట్లకు వెళ్ళడం వల్ల సరిగ్గా పెర్ఫార్మ్ చేయలేకపోయారు. దాంతో దారుణంగా రిజల్ట్స్ వచ్చాయి. ఇక ఈసారి ఎక్కడి వారిని అక్కడే ఉంచుతూ ముందుగానే టికెట్లు ఇచ్చి ప్రోత్సహిస్తారు అని ఒక వైపు ప్రచారం సాగుతోంది. అయితే మరో వైపు చూస్తే ప్రతీ అసెంబ్లీ సీటుకు ముగ్గురేసి మంది నేతల పేర్లు పరిశీలించాలని పార్టీ ఆలోచిస్తోంది అన్న వార్తలు అయితే పార్టీలో కలవరం రేపుతున్నాయని అంటున్నారు.

**రెండేళ్ళ బట్టి అలా :** ఇదిలా ఉంటే వైసీపీకి ఇంచార్జిలను నియమించారు. వీరంతా రెండేళ్ళ బట్టి పనిచేస్తున్నారు. మరో మూడేళ్ళు కష్టపడితే తామే అభ్యర్థులుగా పోటీకి దిగవచ్చు అన్న ఆలోచనలు వారికి ఉన్నాయి. కానీ ఇపుడు ప్రతీ నియోజకవర్గంలో ఆప్షన్లు పెట్టుకుంటూ పోతే చివరికి ఎవరికి టికెట్లు దక్కుతాయన్నది సందేహంగా ఉంది అని అంటున్నారు. ఇదిలా ఉంటే వైసీపీలో కీలక నేత మంగళగిరి నుంచి రెండు సార్లు గెలిచి వచ్చిన ఆళ్ల రామక్రిష్ణారెడ్డికి ఈసారి టికెట్ దక్కుతుందా అన్న చర్చ కూడా సాగుతోంది. అక్కడ మంత్రి నారా లోకేష్ ఉన్నారు. ఆయన మీద గట్టి అభ్యర్దిని ఎంపిక చేయాలని వైసీపీ అధినాయకత్వం చూస్తోంది అని వార్తలు ప్రచారంలో ఉన్నాయి. దాంతో ఆళ్ళను కాకుండా వేరే వారిని పోటీకి దించుతారు అని అంటున్నారు. మరి ఆళ్ళ లాంటి వారికే సీటు గ్యారంటీ లేదా అన్న చర్చ కూడా పార్టీలో సాగుతోంది.

**ముందుగా ప్రకటిస్తేనే :** వైసీపీ విపక్షంలో ఉంది. దాంతో పార్టీని జనంలోకి తీసుకుని వెళ్ళాల్సిన అవసరం కూడా ఉంది. తమకు ఉన్న ఆర్థిక వనరులను ఇంచార్జులుగా ఉన్న వారి ఖర్చు చేయాల్సి ఉంటుంది. వారికి టికెట్ భరోసా కనుక కల్పించకపోతే వారు ఉత్సాహంగా పనిచేయరని అంటున్నారు. ఇక ప్రతిపక్షం పార్టీకి అడ్వాంటేజ్ కూడా ఉందని ముందుగా అభ్యర్థులను ప్రకటించి రంగంలోకి దించితే వారు మరింతగా ప్రజలకు చేరువ అవుతారని అంటున్నారు. ఆ విధంగా బలమైన అభ్యర్థులు అనుకున్న వారిని అలాగే కొనసాగించాలని అంటున్నారు. అంతే తప్ప ఆప్షన్లు పెట్టుకుని ముగ్గురు నలుగురుని అని చూసి చివరి వరకూ ఆలోచించి ఎవరో ఒకరిని ప్రకటించాలని చూస్తే అప్పటి దాకా పార్టీ కార్యక్రమాలు అనుకున్నంత ఊపుగా సాగవని చివరి నిముషంలో అభ్యర్థులు అయిన వారు సర్దుకునే సమయం లేక ఆశించిన ఫలితాలు కూడా రావని అంటున్నారు. మరి అధినాయకత్వం అభ్యర్థుల విషయంలో సర్వేలు చేయిస్తోంది అన్న వార్తలు ఏ మేరకు వాస్తవం అన్నది ఒకటి అయితే అవే నిజం అయితే మాత్రం ఇబ్బంది అని పార్టీలో చర్చ సాగుతోంది. చూడాలి మరి ఏమి జరుగుతుందో.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్




## కారుతో ఢీకొట్టి.. 20 మీటర్లు ఈడ్చుకెళ్లి న్యాయవాది హత్య

### వక్ఫ్ ఆస్తుల వివాదంలో ప్రత్యర్థుల చర్యగా అనుమానం



**నాంపల్లి, విశ్వం వాయిస్ న్యూస్ :** హైదరాబాద్‌లో వక్ఫ్‌బోర్డు ప్యానల్ న్యాయవాది ఖాజా మొహిజుద్దీన్(63) శనివారం ఉదయం ఇంటి ముందు కారు ఎక్కుతుండగా.. దుండగులు కారుతో బలంగా ఢీకొట్టి పరారయ్యారు. తీవ్రగాయాలపాలైన ఆయనను ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించారు. వక్ఫ్ ఆస్తుల వివాదమే హత్యకు కారణమని కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. వారి ఫిర్యాదుతో నాంపల్లి పోలీసులు హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. రెడ్‌హిల్స్ శాంతినగర్‌లోని మోయిజ్ రెసిడెన్సీలో నివాసం ఉండే మొహిజుద్దీన్ సిటీ సివిల్ కోర్టులో, హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. వక్ఫ్ స్థలాలను ఆక్రమించి కళాశాలలు నిర్మించారంటూ ఓ ప్రముఖ విద్యాసంస్థ నిర్వాహకులతో వక్ఫ్‌బోర్డు ప్యానల్ న్యాయవాదిగా న్యాయపోరాటం సాగిస్తున్నారు. ఆయన శనివారం ఉదయం 5.42 గంటలకు స్విమ్మింగ్‌కు వెళ్లేందుకు ఇంటి నుంచి బయటకు వచ్చారు. ఇంటి ముందు నిలిపిన కారు డోర్ తీసేందుకు సిద్ధమవుతున్న సమయంలో కొద్దిదూరంలో నిలిపి ఉన్న కారు వేగంగా వచ్చి ఆయనను ఢీకొట్టి 20 మీటర్ల దూరం లాక్కెళ్లింది. తీవ్రంగా గాయపడిన ఆయనను కుటుంబసభ్యులు ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మధ్యాహ్నం మృతిచెందారు. మొహిజుద్దీన్‌కు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. "మహబూబ్ ఆలంఖాన్, ఆయన కుమారుడు ముజాహిద్ ఆలంఖాన్‌లు వక్ఫ్ స్థలాలను ఆక్రమించి కళాశాలలు నిర్మించారు. ఆ ఆస్తులను కాపాడేందుకు నా తండ్రి న్యాయపోరాటం చేస్తుండడాన్ని జీర్ణించుకోలేక పలుమార్లు మమ్మల్ని బెదిరించారు. ఇప్పటికే నా తండ్రిపై ఐదుసార్లు దాడులు జరిగాయి. గతంలో పోలీసులకు ఫిర్యాదు చేసినా స్పందించలేదు" అని న్యాయవాదైన కుమారుడు ఫర్హాన్ ఆరోపించారు.

**సీసీటీవీ ఫుటేజిలో నమోదైన కారు ఢీకొట్టిన దృశ్యాలు**

దుండగులు మొహిజుద్దీన్‌ను కారుతో ఢీకొట్టిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. పోలీసులు ఈ ఘటనను మొదట హిట్ అండ్ రన్‌గా భావించారు. తరువాత విచారణలో ఉద్దేశపూర్వకంగానే కారుతో ఢీకొట్టినట్టు అంచనాకు వచ్చారు. కారుకు నంబరు ప్లేటు లేకపోవడం అనుమానాలను బలపర్చింది. కారులో మొత్తం నలుగురు ఉన్నట్లు గుర్తించారు. వీరు స్థానికులా..? బయటి నుంచి వచ్చిన ముఠా సభ్యులా? అనే కోణంలో దర్యాప్తు చేపట్టినట్లు డీసీపీ రక్షితాకృష్ణమూర్తి తెలిపారు.

## మంటల్లో చిక్కుకుని భర్త సజీవదహనం..



**భూపాలపల్లి, విశ్వం వాయిస్ న్యూస్ :** భూమిని సాగుకు అనుకూలం చేసేందుకు భార్యభర్తలు చేను వద్దకు వెళ్లారు. వరి కోతల అనంతరం మిగిలిన కొయ్యలకు నిప్పంటించారు. ఆ మంటలు పక్క పొలానికి వ్యాపించడంతో వాటిని ఆర్పేందుకు వెళ్లిన భర్త అగ్నికీలల్లో చిక్కుకొని సజీవ దహనమయ్యారు. ఆ దారుణాన్ని చూసి స్పృహ కోల్పోయిన భార్య తర్వాత చికిత్స పొందుతూ మృత్యు ఒడికి చేరుకున్నారు. ఈ హృదయ విదారక ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం రేపాకపల్లిలో శనివారం జరిగింది. సాగర్ల చంద్రమౌళి(62), భాగ్యమ్మ(58) దంపతులు కుమారుడు భాస్కర్‌తో కలిసి తమ పొలంలోని వరి కొయ్యలకు నిప్పంటించడానికి వెళ్లారు. భాగ్యమ్మ అప్పటికే ఎండ తీవ్రతతో అస్వస్థతకు గురయ్యారు. ఆమెను చెట్టు కింద కూర్చోబెట్టి భాస్కర్ తాగునీరు తీసుకురావడానికి ఇంటికి వెళ్లాడు. తను తిరిగి వచ్చేలోపే చంద్రమౌళి మంటల్లో చిక్కుకొని సజీవదహనమవడం.. భాగ్యమ్మ సొమ్మసిల్లి పడిపోవడం జరిగాయి. భాగ్యమ్మను స్థానికులు హనుమకొండ ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందారు. ఘటనాస్థలాన్ని పరిశీలించిన ఎస్సై సుధాకర్ కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఉదయం పనులకు వెళ్లిన వారు.. సాయంత్రం విగత జీవులుగా మారడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు కన్నీరుమున్నీరయ్యారు.

## ఐఎస్ఐలో చేరేందుకు యత్నం..

### మేడ్చల్‌లో యువకుడి అరెస్టు




**మేడ్చల్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఉగ్రవాద గ్రూపుల్లో చేరేందుకు ప్రయత్నిస్తున్న యువకుడిని మేడ్చల్ పోలీసులు అరెస్టు చేశారు. అతడిని యూపీలోని గాజియాబాద్‌కు చెందిన జయీద్‌ఖాన్‌గా గుర్తించారు. మేడ్చల్‌లోని ముబారక్ హోటల్‌లో పని చేస్తున్న అతడు.. ఇన్‌స్టాగ్రామ్‌లో ఉగ్రవాద సంస్థలను ఫాలో అవుతున్నాడు. కొన్నాళ్లుగా ఉగ్రముఠాలను కలిసేందుకు ప్రయత్నిస్తున్నాడు. పాక్ ఐఎస్ఐలోనూ చేరేందుకు ప్రయత్నిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. జయీద్‌ఖాన్ సామాజిక మాధ్యమాలపై నిఘా పెట్టి పట్టుకున్నారు. అతడి నుంచి నకిలీ తుపాకీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

## గుర్తుతెలియని వృద్ధుడు మృతి



**ఏలూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** గుర్తుతెలియని వృద్ధుడు ఏలూరు రూరల్ పరిధిలోని సాయి నగర్ శివారు ప్రాంతమైన సూర్య నారాయణ కాలనీలో మృతి చెందిపడుతున్నాడు. సమాచారం అందుకున్న ఏలూరు రూరల్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించే పనిలో వద్దారు. అతని వయసు 45 నుండి 50 వరకు ఉంటుందని అంచనా వేస్తున్నారు. వడదెబ్బకు మృతి చెందాడ అనారోగ్య కారణాలతో మృతి చెందాడు అన్న అంశంపై విచారణ చేపట్టారు అనుమానాస్పద మృతిగా కేసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## లారీ డ్రైవర్ మృతి



**ఏలూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చెంచుల కాలనీకి చెందిన బెల్లంకొండ గంగాధర్ రావు 55 లారీ డ్రైవర్‌గా పని చేస్తుంటాడు. భార్య 15 ఏళ్ల క్రితం మృతి చెందింది. ఒంటరిగా సొంత ఇంట్లో ఉంటున్న అతను ఇంట్లో మృతి చెంది పడి ఉన్నాడు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు అధికంగా మద్యం సేవించడం వల్ల మృతి చెంది ఉంటాడని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

## రోడ్డు ప్రమాదంలో అన్న మృతి..

### తమ్ముడి పరిస్థితి విషమం

**బద్వేల్ పట్టణం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎల్లమ్మ తల్లికి బోనాలు సమర్పించుకొని వస్తున్న కుటుంబంలో విషాదం చోటుచేసుకుంది. రోడ్డు ప్రమాదంలో అన్న మృతి చెందగా.. తమ్ముడు మృత్యువుతో పోరాడుతున్నాడు. వివరాల్లోకి వెళితే.. వైఎస్ఆర్ కడప జిల్లా బద్వేల్ పట్టణంలోని గాండ్ల వీధికి చెందిన కుటుంబం.. పోరుమామిళ్ల రంపాడు రోడ్డులోని ఎల్లమ్మ తల్లికి బోనాలు సమర్పించేందుకు వెళ్లింది. కొందరు కారులో బయల్దేరగా.. అన్నదమ్ములు సుభాష్ శివసాయిరాం, సాయి సునీల్ బైక్‌పై వెళ్లారు. తిరుగు ప్రయాణంలో వీరి బైక్ బి.కోడూరు మండలంలోని రామచంద్రపురం గ్రామ సమీపంలో ఎంపీపీ పాఠశాల వద్ద బస్సు వెనుక భాగాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సుభాష్ శివసాయిరాం అక్కడికక్కడే మృతి చెందగా.. సాయి సునీల్‌కు తీవ్రగాయాలయ్యాయి. అతడి పరిస్థితి విషమంగా ఉండటంతో కడప తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు.. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## సహజీవనం.. మహిళ నాలుక కోసి పారిపోయిన ప్రియుడు

**కాప్రా, విశ్వం వాయిస్ న్యూస్ :** సహజీవనం చేస్తున్న వ్యక్తి.. మహిళ నాలుకను కోసి పారిపోయిన సంఘటన హైదరాబాద్‌లోని కుషాయిగూడ ఠాణా పరిధిలో జరిగింది. ఎస్సై కె.సతీశ్ తెలిపిన ప్రకారం.. కుషాయిగూడకు చెందిన మహిళ (50) భర్త చనిపోయి పదేళ్లైంది. నవీన్ అనే వ్యక్తి పరిచయం కావడంతో ఆరు నెలలుగా అతడితో సహజీవనం చేస్తోంది. ఈ నెల 22న అర్ధరాత్రి ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో కోపోద్రిక్తుడైన నవీన్ చాకుతో మహిళ నాలుకను కోసి పారిపోయాడు. స్థానికులు ఆమెను గాంధీ ఆసుపత్రికి తరలించగా.. వైద్యులు శస్త్రచికిత్స చేశారు. బాధిత మహిళ ప్రస్తుతం కోలుకుంటోంది. ఆమె కుమార్తె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

### ప్రియుడితో కలిసి భర్తను చంపి..

## జేసీబీతో గొయ్యితీసి పూడ్చిపెట్టిన భార్య

**నారాయణఖేడ్, విశ్వం వాయిస్ న్యూస్ :** సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ పీఎస్ పరిధిలో దారుణం చోటుచేసుకుంది. మనూర్ మండలం ఎల్గోయిలో భార్య తన భర్తను కిరాతకంగా హత్య చేసిన ఘటన కలకలం రేపింది. వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని గంగాపూర్‌కు చెందిన ముత్యంరెడ్డిని అతడి భార్య.. ప్రియుడు చింటుతో కలిసి హతమార్చింది. అనంతరం ప్రియుడి సాయంతో జేసీబీతో గొయ్యి తీసి భర్త మృతదేహాన్ని పూడ్చిపెట్టింది. ఆ తర్వాత తన భర్త కనిపించడంలేదని పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు అనుమానంతో ఆమెను విచారించడంతో 9 రోజుల తర్వాత అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఘటనాస్థలాన్ని నారాయణఖేడ్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి పరిశీలించారు. నిందితులిద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

## మండుటెండలకు ఎలాంటి ఫుడ్ మంచిదంటే..!




ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం అనేది కాలాను గుణంగా ఉంటేనే మంచిది. అందులోనూ భగభగలాడే ఈమండుటెండల్లో వేడిని తట్టుకోవాలంటే..వంటగదిలో ఈ చిన్నమార్పులు తప్పనిసరి. కొన్నిసార్లు ఆరోగ్యకరమైన ఆహారం వేసవి వేడికి ఇబ్బందికరంగా మారిపోతుంది. అలాగని ఆరోగ్యకరమైన ఆహారాలకు దూరంగా ఉండాలా? అంటే కాదనే అంటున్నారు ఆరోగ్య నిపుణులు. అంతర్గత శరీర ఉష్ణోగ్రత అదుపు తప్పకుండా ఉండేలా తీసుకునే ఆహారంలో చిన్న చిన్న మార్పులు చేసుకుంటే చాలని అంటున్నారు. మరి అవేంటో చూద్దామా.!.

**తీపి పదార్థాలు.. :** తేనె, బెల్లం 'ఆరోగ్యకరమైనవే అయినప్పటికీ ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్నప్పుడు ఇవి తీసుకుంటే శరీరంలో వేడి అధికమయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అందువల్ల ఖర్జూరపు పొడి, స్టీవియా, మంక్ ఫ్రూట్ షుగర్ లేదా దాగా మిశ్రి వంటి వాటికి మారమని సూచిస్తున్నారు నిపుణులు.

**చిరుధాన్యాలు :** జొన్న, మక్కీ, రాగి, కుట్టు, బ్రౌన్ రైస్‌లు ఆరోగ్యకరమైనవే కానీ వేసవిలో మాత్రం అంత మంచివికావని అంటున్నారు. ఎందుకంటే వేసవిలో ఇవి జీర్ణం అవ్వడం కష్టంగా ఉంటుందట. అందుకు బదులుగా జొన్న, జౌ (బార్లీ), సమక్, కాంగ్ని, తెల్ల బియ్యం, ఓట్స్ తీసుకోవాలని సూచిస్తున్నారు.

**పప్పుధాన్యాలు:** కందిపప్పు, మినపపప్పు, కుల్తీ, మోత్(మట్కీ), సోయాబీన్ తదితరాలుబరువుగా ఉండి, గ్యాస్‌ను ఏర్పరుస్తాయనిన్ హెచ్చరిస్తున్నారు నిపుణులు. వీటికి బదులుగా, పెసరపప్పు, మసూర్ పప్పు, లోబియా, కాబూలీ శనగలను తీసుకోండి.

**కూరగాయలు :** వంకాయ, బీట్‌రూట్, పాలకూర వంటివి శరీరంలో వేడిని పెంచి, జీర్ణక్రియకు ఇబ్బంది కలిగించే అవకాశం ఉన్నందున, వాటిని అధికంగా తీసుకోకపోవడమే మేలని చెబుతున్నారు. ప్రత్యామ్నాయంగా సొరకాయ, టిండా(ఇండియన్ బేబీ పంప్కిన్), కద్దు(ఆనపకాయ), పర్వాల్(దొండకాయ రకం), దోసకాయ వంటివి అధిక నీటి శాతం కలిగి ఉండటం వల్ల గొప్ప ప్రత్యామ్నాయాలుగా ఉంటాయి.







**పాల ఉత్పత్తులు :** గేదె పాలు వంటి బరువైన పదార్థాలు సహజంగానే జీర్ణ సమస్యలను కలిగిస్తాయి. అదేవిధంగా, అధికంగా ఉండే పెరుగుకు - దాని శీతలీకరణ గుణాలు ఉన్నప్పటికీ ఇది కూడా మండుటెండలకు అస్సలు మంచిది కాదు. రైతా లేదా పులచటి మజ్జిగాలో తీసుకోవడమే మంచిదని చెబుతున్నారు నిపుణుల.

**మసాలాలు :** సాధారణంగా, ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల పరిధిని దాటినప్పుడు, తేలికపాటి ఆహారం తీసుకోవడం, అధిక మసాలాలు ఉన్న వంటకాలకు దూరంగా ఉండటం మేలు. అయితే, ఎండు అల్లం (సౌంత్), దాల్చినచెక్క, లవంగాలు, నల్ల మిరియాలు, మెంతి గింజలు, పిప్పలి వంటి వేడి చేసే మసాలాలు అసిడిటీని మరింత తీవ్రతరం చేస్తాయి కాబట్టి, వాటి వాడకాన్ని పరిమితం చేయాలని నొక్కి చెబుతున్నారు ఆరోగ్య నిపుణులు. వీటికి బదులుగా, రుచికోసం సోంపు, జీలకర్ర, కొత్తిమీర, పుదీనా, లెమన్‌గ్రాస్ ఉపయోగించమని సూచిస్తున్నారు.

# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...



**కాకినాడ తూర్పు గోదావరి డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ**

సోమవారం, 25 మే, 2026

www.viswamvoice.com




# ఆపదలో ఉన్నవారికి అండగా సీఎం రిలీఫ్ ఫండ్

**పేదల జీవితాల్లో భరోసా నింపుతున్న కూటమి ప్రభుత్వం**

**ఎమ్మెల్యే ఆదిరెడ్డి చేతుల మీదుగా 20 లక్షల చెక్కుల పంపిణీ**

**సీఎం రిలీఫ్ ఫండ్ అనేకమందికి పునర్జన్మను ప్రసాదించింది : కుడుపూడి సత్తిబాబు**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజల కష్టకాలంలో ప్రభుత్వం అండగా నిలవాలనే మహోన్నత సంకల్పంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం సంక్షేమ పాలనను సమర్థవంతంగా అమలు చేస్తోందని రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు పేర్కొన్నారు. రాజమహేంద్రవరం స్థానిక తిలక్ రోడ్‌లోని రెడ్డి కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో రాజమహేంద్రవరం నగర ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు రూ.20 లక్షల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను 35 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. అనంతరం మీడియా సమావేశం లో వారు మాట్లాడుతూ అనారోగ్యం, ప్రమాదాలు, అత్యవసర వైద్య చికిత్సల వంటి క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ నిజమైన ఆర్థిక భరోసాగా నిలుస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం రాజమహేంద్ర వరం నగర పరిధిలోనే వివిధ కేటగిరీల కింద సుమారు రూ.5 కోట్ల 10 లక్షల మేర సీఎం రిలీఫ్ ఫండ్ నిధులను విడుదల చేసి వందలాది కుటుంబాలకు అండగా నిలిచినట్లు తెలిపారు. ప్రజల సమస్యలను కేవలం వినడమే కాకుండా వెంటనే స్పందించి సహాయం అందించే విధంగా పరిపాలన యంత్రాంగాన్ని నడిపించడమే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాలనా దక్షణకు నిదర్శనమన్నారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా పనిచేస్తున్న కూటమి ప్రభుత్వం పేదల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేస్తోందని, ప్రతి అర్హుడికి ప్రభుత్వ ఫలాలు చేరేలా కృషి చేస్తోందన్నారు. రాష్ట్ర అభివృద్ధితో పాటు ప్రజల ఆరోగ్యం, విద్య, ఉపాధి, సామాజిక భద్రత రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ సుపరిపాలన అందిస్తున్నారని కొనియాడారు. ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజల కష్టాలను తన కష్టాలుగా భావిస్తూ ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలుస్తున్న తీరు ప్రతి ఒక్కరికీ ఆదర్శమని పేర్కొన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా అనేక మంది ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడి కొత్త జీవితాన్ని ప్రారంభించగలిగారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నగర అధ్యక్షులు మజ్జి రాంబాబు,నక్కా చిట్టిబాబు,కాశి నవీన్ కుమార్,జనసేన పార్టీ నగర ఇంచార్జ్ అత్తి సత్య నారాయణ,వర్రే శ్రీనివాసరావు, ఉప్పులూరి జానకి రామయ్య, బేసరి చిన్ని, జనసేన పార్టీ రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు వై.శ్రీనివాస్, ఈతలపాటి రవి, బుడ్డిగ రవి, మీసాల మణి, తురకల నిర్మల,కోసూరి చండీ ప్రియ, రాజు, తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.

## తుమ్మలోవ ఆర్ఎంసీ బ్లీచింగ్ స్టాక్ పాయింట్

# భవనంలో అగ్ని ప్రమాదం





**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక తుమ్మ లోవలో కొద్దిసేపటి క్రితం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. రాజమండ్రి మున్సిపల్ కార్పొరేషన్ (ఆర్ఎంసీ)కి సంబంధించిన బ్లీచింగ్ స్టాక్‌ను నిల్వ ఉంచిన భవనంలో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. ప్రస్తుతం అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ ప్రమాదం ఎలాగ జరిగింది అనేది పూర్తి వివరాలు తెలియరావల్సి ఉంది. ఈ ప్రాంతాన్ని రాజమండ్రి శాసనసభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాస్ ఘటనస్థలానికి చేరుకుని సంఘటన ఎలాగ జరిగింది అనేది తెలుసుకున్నారు.







# పుష్కరాలకు నిధులు అసలు వచ్చాయా...

**పుష్కరాలు ఉభయగోదావరి జిల్లాల్లో సీతానగరం నుంచి అంతర్వేది వరకు నిర్వహించాలి**

**పుష్కరాలపై అఖిలపక్షంతో సమీక్ష నిర్వహించాలి - రాజమండ్రిలో పవన్ కళ్యాణ్ పర్యటనతో ప్రజల ఇబ్బందులు : మేడా శ్రీనివాస్**

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ముఖ్యమంత్రుల బలహీనతలే రాజకీయ అస్త్రంగా నేడు మోదీ మార్కు రాజకీయం నడుస్తుందని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ (అర్పిసి) ప్రధాన కార్యాలయంలో జరిగిన పార్టీ వారాంతపు సమావేశంలో అర్పిసి వ్యవస్థాపక అధ్యక్షులు మేడా శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ - తెలంగాణా జలవనరులపై మోదీ, అమిత్ షాలు రాజకీయ కుట్రలు చేస్తున్నారు. గోదావరి జలాలను కావేరి జలాలకు అనుసంధానం చేసి కర్ణాటక రాజకీయాలు మోదీ సర్కార్ వైపు తిప్పుకోవటమే నదులు అనుసంధాన రాజకీయ కుట్ర అన్నారు. అభివృద్ధి, ఉపాధి మార్గాల వైపు దృష్టి సారించకుండా ప్రజల ఆలోచనలను నిర్వీర్యం చేస్తున్నారు. గోదావరి, కావేరి నదులు అనుసంధానంతో ముందుగా ఆంధ్రప్రదేశ్ , తెలంగాణా రాష్ట్రాలకు జరిగే మేలుపై శాస్త్రీయ పరమైన చర్చ జరగాలి. రాజకీయ ప్రయోజనాలే లక్ష్యంగా రెండు తెలుగు రాష్ట్రాల జనవనరుల భవిష్యత్ ను అందకారం చేసే పనిలో మోదీ రాజకీయాలు సాగిస్తున్నారు. నందులు అనుసంధానం జరిగితే స్థానిక రాష్ట్రాలకు నష్టం లేకుండా ఇతర రాష్ట్రాలకు ప్రయోజనం వుండే విధంగా వుండాలి. ప్రజలు నష్ట పోయే విధంగా జల వివాదాలకు ఆజ్యం పోయకూడదన్నారు . నేటి రాజకీయాలు అన్ని సపక్షం, విపక్షం ఒకే విధంగా సొంత ప్రయోజనాల బాటలో నడుస్తున్నాయన్నారు. పోలమూరు, రంగారెడ్డి ఎత్తి పోతలు, పోలవరం, నల్లమల సాగర్ అనుసంధాన ప్రాజెక్ట్ లకు రెండు తెలుగు రాష్ట్రాలు అంగీకరిస్తు సమస్య పరిష్కరించుకోవాలని కొత్త ప్రతిపాదన తీసుకొచ్చిన కేంద్ర జల సంఘం గోదావరి - కావేరి అనుసంధానం అంటు రెండు ప్రతిపాదనలు తెరపైకి తెచ్చిన కేంద్ర ప్రభుత్వ వైఖరి అనేక అనుమానాలకు తావు ఇస్తుందని ఆయన అభిప్రాయం వ్యక్త పరిచారు. తమిళనాడు టి.వి.కే.విజయ్ పార్టీ అధికార భయం మోదీ - అమిత్ షాలకు ఒక వరం వలే వుందన్నారు. మోదీ సర్కార్ రాజకీయ వ్యూహాలన్ని బిజెపి పార్టీ ప్రయోజనాల కన్నా సొంత ప్రయోజనాలే ప్రధాన అజెండాగా అంతర్గత రాజకీయాలు సాగిస్తున్నారు. మోదీ రాజకీయాలకు ప్రపంచ ప్రైవేట్, కార్పొరేట్ దిగ్గజాలు కొమ్ము కాస్తున్నాయని, మోదీ పేరుకు మాత్రమే బిజెపి పార్టీ అని, స్వభావం అంత బహుళ జాతి సంస్థలకు " నిఘామాన్ " వలే వారికి విశ్వాస సేవలు అందుస్తు భారతదేశానికి తీవ్ర మైన నష్టం చేస్తున్నారన్నారు . తమిళనాడులో టి.వి.కే.విజయ్ పార్టీ అధికారం మోదీ దయా దాక్షిణ్యాలపై నడవటానికి ప్రస్తుత తమిళనాడు ముఖ్యమంత్రి రహస్య హామీ పత్రం కుదుర్చుకున్నారనటంలో ఏ మాత్రం సందేహం లేదు.



తెలంగాణా, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలలో యావత్ సహజ వనరులన్ని కార్పొరేట్ దిగ్గజాలకు దాసోహం చేయించటమే మోదీ - అమిత్ షా ల రాజకీయ అంతర్గత కుట్ర అన్నారు. తమిళనాడులో జెండా మాత్రమే టి.వి.కే. పార్టీది అజెండా మొత్తం మోదీ కనుసైగలోనే నడుస్తుంది. ముఖ్యమంత్రి రాజకీయాలకే కొత్త గాని ప్రజలను నమ్మించి మాయ చేయటంలో ప్రత్యేక శిక్షణ తోనే రాజాకీయ ఆరంగేట్రం చేసారనటంలో ఏమాత్రం అనుమానం లేదు . ముఖ్యమంత్రి విజయ్ గెలుపు వెనుక మోదీ ఆశీస్సులు, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి రాజకీయ వ్యూహం ప్రధాన ముడి సరుకు అని చాలా మందికి తెలియవన్నారు. మోదీ - అమిత్ షా లు ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు, తెలంగాణాలో చంద్రబాబు అనుంగ శిష్యుడు ప్రస్తుత కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ కు గాడ్ ఫాదర్ ఆంధ్ర రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి నదులు అనుసంధానం పేరుతోను కర్ణాటక రాష్ట్రంలో రాజకీయ పాచికలు పారించే విధంగా భవిష్యత్ రాజకీయాలకు మార్గం చేసుకుంటున్నారని ఆయన తెలిపారు. కేంద్ర జల సంఘం కొత్తగా రెండు ప్రతిపధనలను ఎందుకు తెరపైకి తెచ్చిందో చెప్పేందుకు మోదీ సర్కార్ సిద్దపడగలదా ! మొదటి ప్రతిపాదనగా తెలంగాణా లోని సమ్మక్క , సారక్క బేరేజి నుంచి కావేరి వరకు గోదావరి జలాలను అనుసంధానం. అదే సమయంలో పోలవరం నుంచి బనకచర్ల మరో అనుసంధానం. రెండవ ప్రతిపాదనగా పోలవరం నుండి కావేరి ఆనకట్ట వరకు నదుల అనుసంధానం ఇందులో 123 టిఎమ్‌సిల నికర జలాలు తమిళనాడుకు కావేరి అనుసంధానంలో కేటాయింపులు చూపిన 41 టిఎమ్‌సిలు కలిపి 164 టి.ఎమ్‌సి.లు పోలవరం నుండి మళ్ళించే లా ప్రణాళికలో గల కుట్రలో ప్రధాన బాగం . అదే సమయంలో సమ్మక్క సారక్క బ్యారేజి నుంచి నాగార్జున సాగర్ వరకు 45 టి ఎమ్ సి లు సాగర్ లో కలపకుండా జలాలు తరలించి తెలంగాణా రాష్ట్రం వాడుకునే విధంగా మరో ప్రతిపాదన తో రెండు తెలుగు రాష్ట్రాలు ముందు ముందు నీటి సమస్యలుతో యుద్దాలు జరిగే విధంగాను, తమిళనాడు, కర్ణాటకలో గోదావరి, పోలవరం జలాలుతో మోదీ రాజకీయ శాసనం సాగే విధంగా కొత్త ప్రతిపాధనలతో నదుల అనుసంధానం పాచికాల క్రీడకు సద్దపడుతున్నారని ఆయన తీవ్ర ఆరోపణ చేసారు. హైదరాబాద్ వేదికగా పవన్ కళ్యాణ్ ను పరామర్శించే కుంటిసాకును ఆసరాగా చేసుకుని చంద్రబాబు, లోకేష్‌ల సాక్షిగా తెలంగాణా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో రహస్య చర్చలు జరగటం నిజం కాదా ! కాదని నిరూపించే దమ్ము వారి వేదికకు వుందా ! అన్నారు. తెలంగాణా, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు ముఖ్యమంత్రుల రాజకీయ బలహీనతలే మోదీ సర్కార్ కు ఒక వరం అని , కుంబకోణాలను ప్రోత్సహించేది, వాటిని బూచిగా చూపి బాంచన్ అనిపించుకునేది మోదీ సర్కార్ ప్రత్యేక మార్కు రాజకీయం అని, కేంద్ర జల సంఘం తీసుకొచ్చిన రెండు కొత్త ప్రతిపాదనలు పై నిపుణులుతో చర్చ జరిపించక పొతే ఆంధ్రప్రదేశ్ నీటి ఏద్దడితో ఎడారిగా మారుతుందని , పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం వృధాగా ఆవుతుందన్నారు . ఇప్పటికే కృష్ణా గోదావరి ఎక్కువ శాతం ఎండిపోతుందని, కృష్ణా నదికి ఎక్కువ శాతం గోదావరి జాలాలే ఆధారంగా మారాయన్నారు. కేంద్ర జల సంఘం కొత్త ప్రతిపాధనలను రెండు తెలుగు రాష్ట్రాలు ఐఖ్యతతో ఎదుర్కొక పొతే తెలంగాణా రైతంగం తీవ్రంగా నష్ట పోతుందని గుర్తుచేస్తున్నారు. ఆంధ్ర రాష్ట్ర ప్రజలు, రైతులు నీటి సమస్యలతో కట కట లాడి పోయే ప్రమాద పరిస్థితులు వెంబడిస్తాయాన్నారు. తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ ప్రజలు మౌనం విడిచి రెండు తెలుగు రాష్ట్రాల భవిష్యత్‌ను కాపాడుకోవటాని ఉమ్మడి కార్యాచరణ లకు సిద్దపడాలని అర్పిసి అధ్యక్షులు మేడా శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సభకు ఆర్పీసీ సీనియర్ సెక్యులర్ మేడిచర్ల శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో అర్పిసి సెక్యులర్స్ ఎమ్‌డి హుస్సేన్, దుడ్డే త్రినాద్, గుడ్ల సాయి దుర్గా ప్రసాద్, బసా సోనియా, దోషి నిషాంత్, ముప్పన రమేష్, మాసా లక్ష్మి, చల్లా శివ దుర్గా రావు, మాసా ప్రమీల, లంక వీర వెంకట సత్యనారాయణ, దోషి సుజల్, నాగూరి సింహాచలం, మాసా అప్పాయమ్మ, చల్లా అఖిల్, తదితరులు పాల్గొన్నారు.

## కోనసీమ జనసేన

# అధ్యక్ష పదవిపై ఉత్కంఠ


**జిల్లా అధ్యక్ష రేసులో ముగ్గురు నేతలు**







**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** అంబేద్కర్ కోనసీమ జిల్లా జనసేన పార్టీ అధ్యక్ష పదవి ఎంపికపై సర్వత్ర ఆసక్తి నెలకొంది. పరిపాలన ప్రాతిపదికన కూటమి ప్రభుత్వం నిర్వహించిన సర్వేలో ఎమ్మెల్యేగా జిల్లాలో మొదటి స్థానం, రాష్ట్ర స్థాయిలో 8వ ర్యాంకు సాధించిన గిడ్డి సత్యనారాయణ జిల్లా అధ్యక్ష రేసులో ముందు వరుసలో ఉన్నట్లు సమాచారం. ఎమ్మెల్యేగా ఆయనకు ఉన్న మంచి పేరుతో జిల్లా అధ్యక్ష పదవి కేటాయిస్తే పార్టీ మరింత బలోపేతం అవుతుందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. అలాగే 2019 అసెంబ్లీ ఎన్నికల్లో కొత్తపేట నుంచి జనసేన పార్టీ తరపున తన సొంత సోదరుడిపై పోటీ చేసిన బండారు శ్రీనివాస్ 35 వేలకుపైగా ఓట్లు సాధించారు. జనసేన పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ బలోపేతానికి జిల్లాలో కృషి చేసిన వ్యక్తుల్లో ఆయన ఒకరని, పార్టీ అధికారంలో లేకపోయినా కోనసీమ జిల్లా వ్యాప్తంగా క్యాడర్‌ను సమన్వయం చేయడంలో మంచి పేరు సంపాదించారని ఆయన వర్గీయులు చెబుతున్నారు. దీంతో ఆయనను అధ్యక్షునిగా నియమించే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. ఇటీవల జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించింది. సభ్యత్వాల నమోదులో కీలకంగా వ్యవహరించిన అమలాపురానికి చెందిన సీనియర్ జనసేన నాయకుడు నల్లా శ్రీధర్ పేరు కూడా అధ్యక్ష రేసులో ఉన్నట్లు సమాచారం. 2019 ఎన్నికల్లో జనసేన పార్టీ అభ్యర్థుల విజయానికి శక్తివంచన లేకుండా పనిచేసిన ఆయన, 2024 ఎన్నికల్లో జనసేనటీడీపీ అభ్యర్థుల విజయానికి కూడా బలంగా కృషి చేసినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. జిల్లాస్థాయి పదవి శ్రీధర్‌కు కేటాయిస్తే పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆయన అనుచరులు అభిప్రాయ పడుతున్నారు.





# ఆరోగ్య విప్లవానికి శ్రీకారం చుట్టిన మంత్రి వాసంశెట్టి సుభాష్

**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆరోగ్య విప్లవానికి శ్రీకారం చుట్టారు. కియా సంస్థ సీఎస్ఆర్ నిధులతో ఇప్పటికే ఏర్పాటు చేసిన మూడు కంటైనర్ క్లినిక్‌లకు అనుబంధంగా, ప్రజలను ఉచితంగా ఆసుపత్రులకు తరలించేందుకు రూ.10 లక్షల వ్యయంతో మూడు ఎలక్ట్రిక్ ఆటోలను ద్రాక్షారామం కాజులూరు కే గంగవరం మండలాల్లో మంత్రి సుభాష్ ఆదివారం ప్రారంభించారు.

**ఒక మిస్ కాల్‌తో వైద్యం మీ ఇంటికే..**

ప్రజలకు వైద్య సేవలు మరింత సులభంగా అందేలా ప్రతి కంటైనర్ క్లినిక్‌కు ప్రత్యేక ఫోన్ నంబర్‌ను కేటాయించారు. అనారోగ్యంతో ఉన్నవారు ఆసుపత్రికి వెళ్లడం ఇబ్బందిగా ఉంటే, సంబంధిత నంబర్‌కు ఒక మిస్ కాల్ ఇస్తే చాలు. వెంటనే ఎలక్ట్రిక్ ఆటో వారి ఇంటి వద్దకు చేరుకుని ఉచితంగా క్లినిక్‌కు తీసుకువెళ్లి వైద్య సేవలు అందిస్తుంది.

సంప్రదించాల్సిన నంబర్లు:
కాజులూరు క్లినిక్: 9951221740
కె.గంగవరం క్లినిక్: 9951221750
ద్రాక్షారామం క్లినిక్: 9951221760

## ఒక మిస్ కాల్‌తోనే వైద్యం ఇంటి ముంగిటకు



**సీఎస్ఆర్ నిధులతో ఆరోగ్య విప్లవం**

నియోజకవర్గ ప్రజల ఆరోగ్య రక్షణే ధ్యేయంగా మంత్రి సుభాష్ కియా సంస్థ ద్వారా సుమారు రూ. 2 కోట్ల సీఎస్ఆర్ నిధులు సమీకరించి మూడు కంటైనర్ ఆసుపత్రులను ఏర్పాటు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ఇవి పనిచేస్తున్నాయి. అలాగే డాక్టర్ ఆన్ వీల్స్ పేరుతో సంచార వైద్యశాలను ప్రారంభించి ప్రతిరోజూ ఒక్కో గ్రామంలో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు.

**గుండెపోటు మరణాలు లేని నియోజకవర్గమే లక్ష్యం**

రామచంద్రపురం నియోజకవర్గంలో గుండెపోటు మరణాలు తగ్గించడమే లక్ష్యంగా మంత్రి సుభాష్ ప్రణాళికలు అమలు చేస్తున్నారు. అధునాతన స్టెతస్కోప్ ద్వారా రోగుల గుండె సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తించే అవకాశం ఉంది. రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో రూ.16 లక్షల సీఎస్ఆర్ నిధులు మరియు సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ సహకారంతో డయాలసిస్ యూనిట్ నిర్మాణం కొనసాగుతోంది. భవిష్యత్తులో కార్పొరేట్ స్థాయి ఆసుపత్రిని నిర్మించి కార్డియాలజిస్టులతో ఆధునిక వైద్య సేవలు అందించేలా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు మంత్రి తెలిపారు.

**ప్రజల హర్షం**

మంత్రి సుభాష్ చేపడుతున్న కార్యక్రమాలపై నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పేదలకు వైద్యం అందించడంలో ఇవి ఆదర్శవంతమైన కార్యక్రమాలని స్థానికులు కొనియాడుతున్నారు. ప్రభుత్వ సేవలతో పాటు సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ద్వారా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతూ ప్రజల హృదయాల్లో మంత్రి సుభాష్ సుస్థిర స్థానం సంపాదించుకున్నారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్ సహారా ఎన్జీవో ప్రతినిధులు వైద్యులు మరియు స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

### పేర్ల హర్ష తేజకు

# అక్షయ ఆర్థిక సహాయం



**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** రావులపాలెం గ్రామానికి చెందిన పేర్ల హర్ష తేజ అనే అబ్బాయికి బోన్ ఇన్ఫెక్షన్ వచ్చి కాళ్లు చేతులు పనిచేయడం లేదు. ట్రీట్మెంట్‌కి 15 లక్షల వరకు ఖర్చు అవుతాదని డాక్టర్ గారు చెప్పారు.వీరి ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రం కారణంగా అక్షయ సేవా సంస్థని సహాయం కోరగా సంస్థ నుంచి 10000 రూపాయలు సంస్థ సభ్యులు ఆంజనేయ రెడ్డి 500 రూపాయలు మొత్తం 10500 రూపాయలు హర్ష తేజ ఇంటికి వెళ్లి హర్ష తేజకు సంస్థ సభ్యులు చేతుల మీదుగా ఇవ్వడం జరిగింది. దీనికి సహకరించిన సభ్యులందరికీ ధన్యవాదములు తెలియజేశారు.

### శ్రామికుల సంక్షేమమే ధ్యేయంగా

# కూటమి ప్రభుత్వం రెండేళ్ల ప్రస్థానం

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర నిర్మాణంలో అహర్నిశలు శ్రమిస్తూ సమాజానికి వెన్నెముకలా నిలిచిన సంఘటిత మరియు అసంఘటిత రంగాల కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం గత రెండేళ్లలో విప్లవాత్మక అడుగులు వేసింది. గత ప్రభుత్వ హయాంలో ఇసుక విధాన లోపాలు మరియు నిధుల దారి మళ్లింపుతో కుదేలైన నిర్మాణ రంగాన్ని, కార్మిక వ్యవస్థలను పునరుద్ధరిస్తూ ప్రభుత్వం కొత్త ఆశలను చిగురింపజేసింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దార్శనికతతో పారిశ్రామిక అభివృద్ధి మరియు కార్మికుల ప్రాణ భద్రతను సమానంగా ముందుకు తీసుకెళ్తూ కార్మిక శాఖలో సరికొత్త ప్రగతిని సాధించింది. రాష్ట్రంలోని ప్రధాన నగరాలైన విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, రాజమండ్రి, గుంటూరు, నెల్లూరు వంటి ప్రాంతాలతో పాటు ఉమ్మడి జిల్లాల కేంద్రాల్లో ఆధునిక ఇంటిగ్రేటెడ్ లేబర్ అమెనిటీస్ సెంటర్ల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ కేంద్రాల ద్వారా కార్మికులకు విశ్రాంతి గదులు, స్వచ్ఛమైన తాగునీరు, మరుగుదొడ్ల వంటి మౌలిక వసతులతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల సమాచారాన్ని అందిస్తోంది. పని లేని సమయంలో కార్మికులు తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకునేలా ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలను ప్రభుత్వం రూపొందిస్తోంది. కార్మికులను కేవలం ఓటర్లుగా కాకుండా రాష్ట్ర నిర్మాణంలో కీలక భాగస్వాములుగా గుర్తించడం ఈ ప్రభుత్వ ప్రత్యేకత. రాష్ట్రంలో దాదాపు 88 లక్షల మంది అసంఘటిత కార్మికులు ఉండగా, అందులో 18 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు ఉన్నారు. గత ఐదేళ్లలో నిలిచిపోయిన సంక్షేమ పథకాలను పునరుద్ధరించి కార్మిక కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తోంది. ప్రసూతి సహాయం కింద రూ. 20 వేలు, వివాహ కానుకగా రూ. 40 వేలు, ప్రమాదవశాత్తు లేదా సహజ మరణం సంభవిస్తే రూ. 20 వేల సహాయం మరియు అంత్యక్రియల నిమిత్తం రూ. 60 వేలను ప్రభుత్వం అందజేస్తోంది. దీనితో పాటు ఉచిత వైద్య పరీక్షలను కూడా అమలు చేస్తోంది. పారిశ్రామిక భద్రతలో భాగంగా జులై 2024లో ప్రత్యేక భద్రతా తనిఖీలు చేపట్టి, నిబంధనలు ఉల్లంఘించిన 23 ఫ్యాక్టరీలపై కఠిన చర్యలు తీసుకుంది. కార్మికుల ప్రాణ రక్షణ కోసం సేఫ్టీ అలర్ట్, ఇన్సిడెంట్ అలర్ట్ వంటి వినూత్న కార్యక్రమాలను ప్రారంభించింది. ప్రమాదకర రసాయన కర్మాగారాల పర్యవేక్షణకు



కెమికల్ ఇన్‌స్పెక్టర్ల పోస్టుల సృష్టికి ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. జేఎన్‌టీయూ, ఎస్‌వీయూ వంటి యూనివర్శిటీలతో ఒప్పందాలు కుదుర్చుకుని పరిశ్రమల్లో థర్డ్ పార్టీ సేఫ్టీ ఆడిట్లు మరియు వందలాది మాక్ డ్రిల్స్ నిర్వహించడం ద్వారా పారిశ్రామిక భద్రతలో ఆంధ్రప్రదేశ్ దేశానికే రోల్ మోడల్‌గా నిలిచింది. ఈఎస్ఐ వైద్య సేవల శాఖను పూర్తిగా ఆధునీకరిస్తూ 15 లక్షల మంది ఇన్సూర్డ్ పర్సన్స్‌కు మెరుగైన వైద్యం అందిస్తోంది. అచ్యుతాపురంలో కొత్త ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణం, తిరుపతి ఆసుపత్రి పడకల సామర్థ్యం 100కు పెంపు మరియు గుంటూరు, కర్నూలు, శ్రీసిటీ, నెల్లూరు ప్రాంతాల్లో కొత్త ఆసుపత్రుల కోసం భూముల కేటాయింపు వంటి చర్యలు చేపట్టింది. విశాఖపట్నంలో 50 సీట్లతో ఈఎస్ఐసీ మెడికల్ కాలేజీని మంజూరు చేయడంతో పాటు, అమరావతిలో 500 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి మరియు మెడికల్ కాలేజీ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఐదేళ్లుగా పెండింగులో ఉన్న శస్త్రచికిత్స సామగ్రి కొనుగోళ్లను రూ. 78 లక్షలతో పునరుద్ధరించి, మై హెల్త్ మరియు ఈ-ఔషధి వంటి మొబైల్ యాప్‌ల ద్వారా ఔషధాల పంపిణీలో పూర్తి పారదర్శకతను తీసుకువస్తూ కార్మిక సంక్షేమానికి కూటమి ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తోంది.

# కూటమి ప్రభుత్వంపై విమర్శలు తగదు


## ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులకు మంత్రి వాసంశెట్టి సుభాష్ కౌంటర్



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** వేదికగా కూటమి ప్రభుత్వం మరియు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు చేస్తున్న నిరాధారమైన ఆరోపణలను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తీవ్రంగా ఖండించారు. ప్రజల తీర్పును జీర్ణించుకోలేని వైసీపీ నేతలు, అబద్ధపు ప్రచారాలతో ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. ఓటర్ల నమోదు మరియు తొలగింపుల ప్రక్రియ పూర్తిగా భారత ఎన్నికల సంఘం పర్యవేక్షణలోనే జరుగుతాయని ఇందులో ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం వారి రాజకీయ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడమేనని మంత్రి పేర్కొన్నారు. చంద్రబాబు నాయుడు ప్రజాస్వామ్యానికి కట్టుబడి పనిచేసే నాయకుడని, ఆయనపై విమర్శలు చేయడం వైసీపీ నేతల అజ్ఞానానికి నిదర్శనమని విమర్శించారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం అమరావతిని నిర్వీర్యం చేసి రాష్ట్రాన్ని అయోమయంలోకి నెట్టిందని కానీ ఇప్పుడు కూటమి ప్రభుత్వం అమరావతిని ప్రపంచ స్థాయి రాజధానిగా తీర్చిదిద్దేందుకు వేగంగా పనులు చేపడుతోందని సుభాష్ వెల్లడించారు. అమరావతి అనేది కేవలం ఒక రాజధాని మాత్రమే కాదని అది ఆంధ్రప్రదేశ్ ఆత్మగౌరవానికి ప్రతీక అని ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో రాష్ట్రం తిరిగి పురోగతి పథంలో సాగుతోందని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రజా సమస్యల పరిష్కారానికి ఎంతో కృషి చేస్తున్నారని కొనియాడారు. కూటమి ప్రభుత్వం సంక్షేమం మరియు అభివృద్ధిని సమానంగా ముందుకు తీసుకెళ్తోందని, ఇకనైనా ప్రజలను భ్రమపెట్టే రాజకీయాలను మానుకుని రాష్ట్ర పునర్నిర్మాణానికి సహకరించాలని ఆయన వైసీపీ నేతలకు సూచించారు. పారదర్శకమైన పాలన అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర భవిష్యత్తు కోసం ప్రతి అడుగు బాధ్యతాయుతంగా వేస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు.

### రామచంద్రపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో

# నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక




**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం రెవెన్యూ డివిజన్ పరిధిలోని ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు వీలుగా, సోమవారం, మే 25, 2026 ఉదయం 10 గంటల నుండి రామచంద్రపురం రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. రెవెన్యూ డివిజనల్ అధికారి ఎ.సరళవతి ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహిస్తూ డివిజన్ స్థాయి అధికారులతో కలిసి ప్రజల నుండి నేరుగా అర్జీలను స్వీకరించనున్నారు. వివిధ సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తు చేసుకునే ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన పూర్తి వివరాలతో ఈ కార్యక్రమానికి హాజరు కావాలని సూచించడమైనది. కార్యాలయానికి నేరుగా రాలేని వారు 'మీకోసం' పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో, లేదా వాట్సాప్ గవర్నెన్స్ నంబరు 9552300009కు మెసేజ్ చేయడం ద్వారా ఫిర్యాదులను నమోదు చేసుకోవచ్చు. అంతేకాకుండా సమస్యల వివరాలు లేదా ఇతర సమాచారం కోసం 1100 టోల్ ఫ్రీ నంబరును సంప్రదించి పౌర సేవలను పొందవచ్చని అధికారులు తెలియజేశారు.

# రైతాంగానికి అండగా కూటమి ప్రభుత్వం

- వ్యవసాయం నుంచి ఆక్వా వరకు ప్రతి రంగంపై ప్రత్యేక దృష్టి
- ఎండలు, మార్కెట్ సంక్షోభాలపై హై అలర్ట్
- ప్రతి సమస్యకు తక్షణ పరిష్కారంపై మంత్రి అచ్చెన్నాయుడు ఫోకస్
- ప్రకృతి సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధం
- రైతులకు సాంకేతిక సహాయం, సబ్సిడీలు, మార్కెట్ మద్దతు
- రైతులు ఆందోళన చెందవద్దు
- రైతు ప్రయోజనాల పరిరక్షణలో రాజీ లేదు
- వైసీపీ అసత్య ప్రచారాలపై మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఫైర్
- గత ఐదేళ్లు రైతులు అగాదంలోకి వెళ్లారు... కూటమి ప్రభుత్వంలోనే మంచి ధరలు లభిస్తున్నాయన్న మంత్రి అచ్చెన్న

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో రైతులు, పౌల్ట్రీ, ఉద్యాన, ఆక్వా రంగాలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యపై కూటమి ప్రభుత్వం అత్యంత అప్రమత్తంగా పనిచేస్తోందని, రైతాంగ ప్రయోజనాల పరిరక్షణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ,అనుబంధ శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. యూరియా లభ్యత నుంచి మొక్కజొన్న ధరలు, రొయ్యల మార్కెట్ పరిస్థితులు, కొబ్బరి రైతుల సమస్యలు, అనంతపురం నీటి ఎద్దడి వరకు ప్రతి అంశంపై వ్యవసాయ, అనుబంధ శాఖల డైరెక్టర్స్ తో మంత్రి జూమ్ సమావేశం నిర్వహించి ప్రతి అంశంపై లోతైన చర్చ జరిపారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రైతు సంక్షేమం విషయంలో కూటమి ప్రభుత్వం ఎప్పుడూ రాజీ పడదు. ప్రజా సమస్యలను పరిష్కరించడం మా లక్ష్యం. కానీ వైసీపీ నాయకులు మాత్రం సమస్యల పరిష్కారంపై కాకుండా రాజకీయ లాభాల కోసం అబద్ధాల ప్రచారం చేస్తున్నారు. రాష్ట్ర ప్రజలు వాస్తవాలను బాగా అర్థం చేసుకుంటున్నారు అని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎక్కడా యూరియా కొరత లేకుండా సరఫరా వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని అధికారులు వివరించారు. అవసరమైన నిల్వలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధరలు అందేలా మార్కెట్ పరిస్థితులను ప్రభుత్వం నిరంతరం పరిశీలిస్తోంది. మధ్యవర్తుల దోపిడీని అరికట్టేందుకు చర్యలు కొనసాగుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ ప్రభావం కారణంగా వచ్చిన తాత్కాలిక పరిస్థితులను అధిగమించేందుకు మత్స్యశాఖ ద్వారా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు సమావేశంలో చర్చించారు. కొబ్బరి రైతులకు మద్దతుగా మార్కెటింగ్ అవకాశాలు పెంచడం,



సహాయక చర్యలు చేపట్టడం పై ఉద్యానవన శాఖకు మంత్రి దిశానిర్దేశం చేశారు. నీటి ఎద్దడిపై ప్రభుత్వం అప్రమత్తంగా ఉందని, సాగు, తాగునీటి అవసరాల కోసం ప్రత్యామ్నాయ చర్యలు అమలు చేస్తున్నట్లు అధికారులు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో అసాధారణ ఎండలు, వాతావరణ మార్పులు, అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులు వంటి సవాళ్ల మధ్య కూడా రైతులు, పౌల్ట్రీ, ఆక్వా, ఉద్యాన రైతులను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం పూర్తి స్థాయిలో చర్యలు చేపడుతోందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో 45 డిగ్రీల సెల్సియస్‌కు పైగా నమోదవుతున్న భీకర ఉష్ణోగ్రతల కారణంగా పౌల్ట్రీ రంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందని, గత నాలుగు రోజులుగా నమోదైన వడగాల్పుల ప్రభావంతో రాష్ట్రంలోని సుమారు 5.5 కోట్ల కమర్షియల్ లేయర్ కోళ్లలో 2.5 శాతం నుంచి 3.5 శాతం వరకు మరణాలు సంభవించినట్లు ప్రాథమిక అంచనా అని వెల్లడించారు. ఈ అంశాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లామని, పౌల్ట్రీ రంగాన్ని ఆదుకునేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఒక్క కోడికి రూ.100 చొప్పున గరిష్టంగా 100 కోళ్ల వరకు, ఒక్క లబ్ధిదారునికి గరిష్టంగా రూ.10,000 వరకు పరిహారం అందించవచ్చని పేర్కొన్నారు. అయితే నష్టం అంచనా రూ.10,000 కంటే అధికంగా ఉన్న సందర్భాల్లో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ప్రత్యేక సహాయం అందించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందని తెలిపారు.గతం ప్రభుత్వంలో 2020-21 ఖరీఫ్‌లో 1,98,092 మెట్రిక్ టన్నుల కొనుగోళ్లతో రూ.95.62 కోట్ల నష్టం, అదే ఏడాది రబీలో 2,98,391 మెట్రిక్ టన్నుల కొనుగోళ్లతో రూ.91.50 కోట్ల నష్టం, 2021-22 రబీలో 2,762 మెట్రిక్ టన్నుల కొనుగోళ్లతో రూ.0.19 కోట్ల నష్టం, 2022-23 రబీలో 71,064 మెట్రిక్ టన్నుల కొనుగోళ్లతో రూ.2.44 కోట్ల నష్టం సంభవించినప్పటికీ ప్రస్తుతం రైతులకు నష్టం లేకుండా సమర్థవంతమైన విధానంతో ముందుకు వెళ్తున్నామని పేర్కొన్నారు. రైతులను కాపాడేందుకు మార్క్ ఫెడ్ ద్వారా 2.04 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్నను మీఫ్రా వద్ద కొనుగోలు చేయాలని నిర్ణయించి, Price Stabilization Fund (PSF) నుంచి రూ.630 కోట్ల అడ్వాన్స్ మంజూరు చేయాలని కేంద్రానికి ప్రతిపాదనలు సమర్పించామని తెలిపారు. అనంతపురం జిల్లాలో గార్లదిన్నె, సింగనమల, బుక్కరాయసముద్రం, కంబదూరు, సెట్టూరు, ఆత్మకూరు, యాడికి మండలాల్లోని సుమారు 37 వేల హెక్టార్ల బత్తాయి, నిమ్మ విస్తీర్ణంలో దాదాపు 2,260 హెక్టార్లు నీటి ఎద్దడికి గురైనట్లు వివరించారు. రెండు నెలల క్రితమే జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామని, డ్రిప్ ఇరిగేషన్ ఆటోమేషన్ పథకానికి హెక్టారుకు రూ.40 వేల వ్యయంపై రూ.22 వేల రాయితీ, డబుల్ లేటరల్ డ్రిప్ వ్యవస్థకు హెక్టారుకు రూ.41,850 వరకు సబ్సిడీ, 20ఇ20ఇ3 మీటర్ల రైతు నీటి కుంటలకు రూ.90 వేల రాయితీతో పాటు ఫెన్సింగ్‌కు అదనంగా రూ.15 వేల సబ్సిడీ అందిస్తున్నామని తెలిపారు. వీడ్ మ్యాట్ వినియోగాన్ని కూడా ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో సుమారు 1.10 లక్షల ఎకరాల్లో సాగవుతున్న కొబ్బరి పంటలో గత ఏడాది జూన్ నుంచి ఆగస్టు వరకు నమోదైన భారీ వర్షాలు, అధిక తేమ, తగినంత సూర్యరశ్మి లేకపోవడం వల్ల పువ్వులు, పిందెలు రాలిపోవడంతో దిగుబడులు తగ్గాయని తెలిపారు. సాధారణంగా ఎకరాకు 1,000 నుంచి 1,200 కాయల దిగుబడి రావాల్సి ఉండగా ప్రస్తుతం కొన్ని ప్రాంతాల్లో 600 నుంచి 800 కాయలకే పరిమితమైందన్నారు. అయితే ఇది పూర్తిగా తాత్కాలిక పరిస్థితి మాత్రమేనని స్పష్టం చేశారు. ప్రస్తుతం కొత్త కొబ్బరి కురిడి వెయ్యింటికి రూ.15,000, పాతకాయ గండేరా రూ.30,000, గుటుగుటు రూ.25,000, కొత్తకాయ గండేరా రూ.28,000, కొత్తకాయ గుటుగుటు రూ.24,000, పాత ముక్కుడు కాయ రూ.15,000--16,000, కొత్త సచ్చి కాయ రూ.15,000--16,000 మధ్య ధర పలుకుతోందని, కొబ్బరి నూనె 15 కిలోల టిన్ రూ.5,000, కిలో ధర సుమారు రూ.350గా ఉందని తెలిపారు. జ్యేష్ఠ మాసం ముగిసిన వెంటనే ఉత్తరాది రాష్ట్రాల నుంచి డిమాండ్ పెరిగే అవకాశం ఉందన్నారు. మరోవైపు రొయ్యల రైతులకు SEAI AP Region పూర్తి భరోసా ఇచ్చిందని, అంతర్జాతీయంగా ఈక్వెడార్ తదితర దేశాల్లో ధరలు తగ్గినా, ఒడిశా , పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో ధరల పతనం ఉన్నప్పటికీ ఆంధ్రప్రదేశ్ రైతుల ప్రయోజనాల కోసం 100 కౌంట్ రొయ్యలకు కిలోకు రూ.230, 40 కౌంట్‌కు రూ.330, 30 కౌంట్‌కు రూ.430 ధరలను ఈ నెలాఖరు వరకు కొనసాగిస్తున్నట్లు ప్రకటించిందన్నారు. చిన్న సైజు రొయ్యలను తొందరపడి హార్వెస్ట్ చేయవద్దని, ప్రకటించిన ధరల కంటే తక్కువకు అమ్మవద్దని రైతులకు సూచించారు. గత వారం ఆక్వా ఫీడ్ రేట్లు పెరుగుతున్నాయనే రైతుల ఆందోళన నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే స్పందించి సెక్రటేరియట్‌లో ఆక్వా అడ్వైజరీ కమిటీతో అత్యవసర సమావేశం నిర్వహించిందని మంత్రి తెలిపారు. ఆ సమావేశంలో ఫీడ్ ధరల పెరుగుదలను తాత్కాలికంగా నిలిపివేసి, పూర్తి విచారణ అనంతరం ఏపీ స్టేట్ ఆక్వాకల్చర్ డెవలప్మెంట్ అథారిటీ ద్వారా తుది నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేసినట్లు చెప్పారు. ఈ జూమ్ సమావేశంలో వ్యవసాయ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్, వ్యవసాయ, మత్స్య, ఉద్యానవన, పశు సంవర్ధక, మార్కెటింగ్ శాఖల డైరెక్టర్స్ పాల్గొన్నారు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY

కాకినాడ
జిల్లా ఎడిషన్

సోమవారం, 25 మే 2026
www.viswamvoice.com



# అమెరికాలో ఎమ్మెల్యే సత్యప్రభ... ఇండియాలో బర్త్ డే సెలబ్రేషన్స్...!

**వేసవిలో పిల్లలతో గడుపుతున్న ఎమ్మెల్యే సత్యప్రభ - ప్రత్తిపాడులో మిన్నంటుతున్న శుభాకాంక్షల హోరు**
**గ్రామా గ్రామాన పోటాపోటీగా నాయకల వేడుకలు - ఎమ్మెల్యే కాక మునుపు ఈ వేడుకల హడావిడి లేదు**

**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అమెరికాలో ఉన్న, కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శాసన సభ్యురాలు వరుపుల సత్యప్రభ జన్మదిన వేడుకలను ఆదివారం నియోజకవర్గం వ్యాప్తంగా హోరెత్తించారు. మునుపు ఎన్నడూ కనీ వినీ ఎరుగని రీతిలో ఈ పుట్టినరోజు వేడుకలు ప్రాముఖ్యతను సంతరించు కున్నాయి. ఈమె దివంగత ప్రత్తిపాడు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జి నేత వరుపుల రాజా సతీమణిగా ప్రజలక చిర సుపరిచితురాలు. అయన హఠాత్తు మరణానంతరం ఆయన స్థానంలో నియోజకవర్గం పార్టీ ఇంచార్జి నేతగా బాధ్యతలను స్వీకరించి, మహిళా నేత, ప్రత్యక్ష రాజకీయాల్లో ప్రధాన పాత్రను అంతగా పోషించ నప్పటికీ రాజా మరణ సానుభూతితో తెలుగు దేశం పార్టీ ప్రభంజనంలో 2024 శాసనసభ ఎన్నికల్లో అత్యధిక ఆధిక్య ఓట్లతో సత్యప్రభ ఘన విజయాన్ని సాధించారు. రాజా, సత్యప్రభ దంపతులకు ఇద్దరు పిల్లలు. ఒక కుమారుడు సాయి తర్షిత్ (ప్రతీక్), కుమార్తె సత్యమాధురి (అమూల్య). ఈ పిల్లలు ఇద్దరూ వారి ఉన్నత చదువులకు ప్రస్తుతం అమెరికాలోఉంటున్నారు. కుమార్తె సత్యమాధురి అరిజోనా స్టేట్ యూనివర్శిటీలో బిజినెస్ అనలిటిక్స్ చదువుతున్నది. వీరి దగ్గర కొద్ది రోజుల పాటు స్వయంగా ఉండి వారి ఆలనా, పాలనా చూసుకు



నేందుకు ఎమ్మెల్యే బుధవారం 29.04.2026 అమెరికాకు వెళ్లారు. ఆమె హైదరాబాద్ లోని విమానాశ్రయం నుంచి నేరుగా అమెరికాకు పయనం అయ్యారు. ప్రస్తుతం ఎమ్మెల్యే అమెరికాలోనే ఉన్నారు. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ 24 మే 1979 లో జన్మించారు. ఈమె వయసు 47 సంవత్సరాలు. ఈ రోజు ఆమె జన్మదినం. దీంతో ప్రత్తిపాడు నియోజకవర్గం వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో వివిధ స్థాయిల పార్టీ నేతల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సత్యప్రభ జన్మదిన వేడుకలను అత్యంత వైభవంగా, ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల నిర్వహణలో పోటాపోటీగా అత్యంత భారీ తనాన్ని ప్రదర్శించారు. ఈ రోజుకు కొన్ని రోజులు ముందు నుంచి ఎ ఫ్యూ డేస్ గోస్ టూ... వన్, టూ, త్రీ డేస్ గోస్ టూ... అంటూ సామాజిక మాధ్యమాల్లో ముందస్తు జన్మదిన వేడుకలను ప్రకటించిన అభిమానులు వాస్తవ జన్మదినమైన ఈ ఆదివారం తమ ప్రచార పటాటోపంతో ఏకంగా సోషల్ మీడియాను షేక్ చేసారు. వాస్తవానికి... ఏ మాటకు ఆ మాటే చెప్పుకోవాలి. వరుపుల సత్యప్రభ ఎమ్మెల్యే కాక మునుపు ఈ జన్మదిన శుభాకాంక్షల వేడుకలు ఆమె ఇంటికే పరిమితం. ఈ వేడుకల బహిరంగ హడావిడి మునుపు ఎప్పుడూ లేదు. ఇప్పుడు ఆమె ఎమ్మెల్యే కావడంతో ఆమె జన్మదిన వేడుకలను అంతర్జాలం ద్వారా అంతర్జాతీయం చేశారు. ప్రత్తిపాడు నియోజకవర్గం రెండో మహిళా ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభకు మనఃపూర్వక జన్మదిన శుభాకాంక్షలు.

జిల్లా వ్యాప్తంగా రౌడీ షీటర్లకు

# కౌన్సిలింగ్ ఇచ్చిన పోలీసులు



**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ఇంచార్జి ఎస్పీ రాహుల్ మీనా ఈ మేరకు ఈ రోజు జిల్లావ్యాప్తంగా పలు పోలీస్ స్టేషన్లలో రౌడీ షీటర్లకు ప్రత్యేక కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు పాత నేరస్తులందరికీ గట్టి హెచ్చరికలు జారీ చేస్తూ... తమ పాత నేర ప్రవృత్తిని పూర్తిగా వీడి, సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా సత్ప్రవర్తనతో మెలగాలని స్పష్టం చేశారు. భూ సెటిల్మెంట్లు, అసాంఘిక కార్యకలాపాలు, ఇతర గొడవలకు దూరంగా ఉండాలని, లేనిపక్షంలో చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని తేల్చి చెప్పారు. రౌడీ షీటర్ల కదలికలపై నిరంతర నిఘా ఉంటుందని, ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే ఎట్టిపరిస్థితుల్లోనూ సహించేది లేదని ఈ సందర్భంగా జిల్లా పోలీసు యంత్రాంగం హెచ్చరించింది.

ఓటర్ల జాబితా సవరణలో

# బీఎల్ఏలదే కీలక బాధ్యత

**కాకినాడ జిల్లా వైఎస్సార్సీపీ అధ్యక్షుడు దాడిశెట్టి రాజా**
**అన్నవరంలో బూత్ లెవెల్ ఏజెంట్లకు శిక్షణా కార్యక్రమం**



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** దేశ వ్యాప్తంగా పార దర్శకమైన ఓటర్ల జాబితాను సిద్ధం చేయడం కోసం కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన "ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ" (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ - సర్) ప్రక్రియలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్లు అత్యంత కీలక పాత్ర పోషించాలని కాకినాడ జిల్లా పార్టీ అధ్యక్షులు దాడిశెట్టి రాజా పిలుపును ఇచ్చారు. నియోజకవర్గంలోని ప్రతి ఓటును క్షుణ్ణంగా పరిశీలించాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కును కల్పించేలా బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) బాధ్యతగా వ్యవహరించాలని ఆయన సూచించారు. ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం అన్నవరంలోని శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానం నర్సరీ గార్డెన్ ఎదురుగా ఉన్న కే.కే. ఫంక్షన్ హాలులో సర్ పై ప్రత్యేక అవగాహన, కార్యాచరణ సమావేశాన్ని పార్టీ నియోజకవర్గం ఇంచార్జి ముద్రగడ గిరిబాబు ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 4.30-7.30 గంటల మధ్య నిర్వహించారు. గిరిబాబు అధ్యక్షతన నిర్వహించిన నియోజకవర్గ స్థాయి బీఎల్ఏల శిక్షణా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన దాడిశెట్టి రాజా మాట్లాడుతూ... జూన్ 15 నుంచి జూలై 14 వరకు నిర్వహించనున్న ప్రత్యేక సంక్షిప్త సవరణ కార్యక్రమంలో భాగంగా బూత్ లెవెల్ ప్రభుత్వ అధికారులతో సమన్వయం చేసుకుంటూ డోర్ టు డోర్ సర్వేలో పాల్గొనాలని కోరారు. అనర్హుల ఓట్ల తొలగింపు, కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియను పకడ్బందీగా పర్యవేక్షించాలని ఆయన స్పష్టం చేశారు. పార్టీని బలోపేతం చేయడంతో పాటు ఓటర్ల జాబితాల పటిష్టత కోసం ప్రతి కార్యకర్త అంకితభావంతో కృషి చేయాలని రాజా పిలుపును ఇచ్చారు. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (సర్)పై దృశ్య శ్రవణ మాధ్యమం ద్వారా బి.వి.ఆర్.చౌదరి చాలా విపులంగా వివరించారు. ఓటరు హక్కుల పరిరక్షణకు, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతకు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అర్హత నిర్ధారణకు కీలకమైన ప్రక్రియగా ఉండనుందని ఆయన వెల్లడించారు. స్థానిక సంస్థల ఎన్నికలు, పలు సంక్షేమ పథకాల అమలులో సర్ సమాచాం కీలక పాత్ర పోషించే నేపథ్యంలో ప్రతీ నాయకుడు, కార్యకర్త సర్ పై సంపూర్ణ అవగాహన కలిగి ఉండటం అత్యంత అవసరమని బి.వి.ఆర్.చౌదరి వివరించారు. ఈ కార్యక్రమంలో అందిస్తున్న సమాచారం భవిష్యత్ ఎన్నికల నిర్వాహణకు, ఓటర్ల హక్కుల పరిరక్షణకు ఎంతో ఉపయోగ పడుతుందని జిల్లా పార్టీ పరిశీలకులు దాట్ల సూర్యనారాయణరాజు, వై.కా.పా. సర్ టాస్క్ ఫోర్స్ సభ్యులు ఒమ్మి రఘురామ, వాసిరెడ్డి జమీలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల పార్టీ మాజీ కార్యదర్శి డాక్టర్ యడ్ల సత్యనారాయణ, పార్టీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు, అన్నవరం మాజీ సర్పంచ్ శెట్టిబత్తుల కుమార్ రాజా, నియోజకవర్గ పార్టీ ప్రచార కమిటీ అధ్యక్షుడు సరమర్ల మధుబాబు, బూత్ కమిటీల అధ్యక్షులు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, గ్రామ పార్టీ అధ్యక్షులు, గ్రామాల ఐటీ వింగ్ నాయకులు, బీఎల్ఏలు, పార్టీ ముఖ్య నాయకులతో పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# పండూరు చెరువు అభివృద్ధికి ఎమ్మెల్యే చేయూత



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ మాట్లాడుతూ పి.వెంకటాపురం గ్రామంలో ఉన్న పండూరు చెరువును అత్యంత సుందరంగా అభివృద్ధి చేయడానికి 50 లక్షల రూపాయల వాటర్ షెడ్ నిధులు ఉపయోగించడం జరుగుతుందన్నారు. ఆదివారం నాడు మండల అధికారులు, గ్రామ అధికారులు కూటమి నాయకులు సమక్షంలో ఎమ్మెల్యే నానాజీ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. చెరువు గట్టును చెరువు చుట్టూ బలంగా నిర్మించాలని, యువతి యువకులకు, మరియు పెద్దవాళ్లకు ఆరోగ్యపరంగా ఉపయోగపడేలాగా వాకింగ్ ట్రాక్ ను సుందరంగా తీర్చిదిద్దాలని, గట్టుపై బెంచీలు, సోలార్ విద్యుత్ లైట్లను, మొక్కల పెంపకం వంటి పనులు చేపట్టి, కాకినాడ రూరల్ లోనే ఒక ప్రత్యేకమైనటువంటి గ్రామంగా తీర్చిదిద్దుతానని తెలిపారు. స్థానికులకు ఉపాధి కల్పన ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఖాదీ బండారు స్టేట్ డైరెక్టర్ శిరంగి శ్రీనివాస్, కాకినాడ రూరల్ ఎంపీడీవో సతీష్, జనసేన రాష్ట్ర కార్యదర్శి తాటికాయల వీరబాబు, బిజెపి నాయకులు రంబాల వెంకటేశ్వర్లు, మాజీ ఎంపిటిసి నందిపాటి శ్రీనివాస్, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాస్ బాబా, టిడిపి సీనియర్ నాయకులు నులుకుర్తి వెంకటేశ్వరరావు, జనసేన నాయకులు మదారపు తాతాజీ, సుబ్రహ్మణ్యం, బాలు అధికారులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# "కౌడ చైర్మన్"గా తలాటం సత్య ప్రమాణ స్వీకారం

**హాజరైన ప్రముఖులు - కౌడ సేవలను మరింతగా విస్తరించాలి**



**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** కౌడ సేవలు అందరికీ అందేలా ఆ సంవత్సరం అభివృద్ధి చేస్తానని కాకినాడ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ తలాటం నాగ సత్యనారాయణ (సత్య) పేర్కొన్నారు. కౌడ చైర్మన్గా తలాటం సత్య ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని కాకినాడ కుళాయి చెరువులో ఆదివారం గోదావరి కళాక్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మం త్రులు కందుల దుర్గేష్, వాసంశెట్టి సుభాష్ ఇంకా ప్రజాప్రతినిధులు హాజరై సత్యతో ప్రమాణ స్వీకారం చేయించారు. కష్టపడే ప్రతి కార్యకర్తకు అవకాశం వస్తుందని అందువల్ల కార్యకర్తలు అందరూ మనో ధైర్యంగా ఉండాలని వారు సూచించారు. ఈ పదవి చాలాకాలంగా ఎవరికి వస్తుందో అనే ఆశగా ఎదురు చూశారని చివరికి అధిష్టానం కట్టబెట్టిందన్నారు. కౌడ అభివృద్ధికి తన వంతు ఎనలేని కృషి చేస్తానని చైర్మన్ సత్య పేర్కొన్నారు. ఈ పదవి రావడానికి కారణమైన వారందరికీ సత్య ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, ఎమ్మెల్సీలు కర్రి పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖర్, ఎమ్మెల్యేలు పంతం నానాజీ, వనమాడి కొండబాబు, నల్లమిల్లి రామ కృష్ణారెడ్డి రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్, డిసిసి బ్యాంక్ చైర్మన్ తుమ్మల బాబు, కాకినాడ మార్కెట్ కమిటీ చైర్మన్ బచ్చు శేఖర్, నాయకులు వేగుళ్ళ లీలా కృష్ణ, పెండెం దొరబాబు, ముత్తా నవీన్, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ వేటుకూరి సూర్యనారాయణ రాజు, పిల్లి అనంత లక్ష్మి, నురుకుర్తి వెంకటేశ్వరరావు, ఆకుల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# యుద్ధాన్ని మీరు మొదలెట్టారు.. నేను ముగిస్తాను!

గత కొద్ది రోజులుగా ప్రొఫెసర్ నాగేశ్వర్ సోషల్ మీడియాలో మెయిన్ కంటెంట్ అయిపోయారు. ఆయన చుట్టూనే అంతా సాగుతోంది. ఢిల్లీలో కేంద్ర మంత్రి అమిత్ షాని పవన్ నాదెండ్ల మనోహర్ కలిసి జగన్ ని అరెస్ట్ చేయమని కోరారని, దానికి అమిత్ షా జగన్ లాంగ్ టెర్మ్ ఫ్రెండ్ అని చెప్పారని ఒక యూ ట్యూబ్ చానల్ లో ప్రొఫెసర్ చేసిన కామెంట్స్ అతి పెద్ద రచ్చకు దారి తీశాయి. ఇది ఏపీలో కూటమి రాజకీయాలను సైతం కుదిపేసింది. జగన్ అరెస్ట్ పవన్ కి ఎందుకు అంత అవసరం అన్నది ఒక చర్చ అయితే అసలు కేంద్రంలో బీజేపీకి వైసీపీకి మధ్య తెర వెనక బంధం నిజమా అన్నది మరో చర్చ. ఇవన్నీ పక్కన పెడితే అమిత్ షా పవన్ నాదెండ్ల ముగ్గురు మాత్రమే ఉన్న ఆ భేటీ వివరాలు ప్రొఫెసర్ కి ఎలా తెలిసాయని జనసేన లాజిక్ తో కూడిన ప్రశ్న వేసి ప్రొఫెసర్ ని ఇరికించింది.

**సోషల్ మీడియాలో రచ్చ :** తనకు జనసేన కీలక నేతల నుంచి లీక్స్ అందాయని మొదట చెప్పిన ప్రొఫెసర్ తరువాత ఇంత రచ్చ జరగడంతో తనకు తప్పుడు సమాచారం అందిందని చెప్పి తన వ్యాఖ్యలు ఉప సంహరించుకుంటున్నాను అని బోల్డ్ గా స్టేట్ మెంట్ ఇచ్చేశారు. ఆ మీదట సారీ అని కూడా అనేశారు. అయినా సరే ఈ వివాదం ఎక్కడా ఆగడం లేదు, ప్రొఫెసర్ మీద జనసేన నేతలు కాకినాడ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. అలాగే సోషల్ మీడియా వేదికగా టీడీపీ జనసేన సోషల్ మీడియా యాక్టివిస్టులు అయితే ప్రొఫెసర్ ని గట్టిగా టార్గెట్ చేస్తున్నారు. ఆయనను వైసీపీ పేటీఎం అని ఇంకా అనేక రకాలుగా కామెంట్స్ చేస్తూ వస్తున్నారు. దాంతో మరింత ఆగ్రహించిన ప్రొఫెసర్ ఒక యూ ట్యూబ్ చానల్ లో మాట్లాడుతూ ఒక పవర్ ఫుల్ స్టేట్మెంట్ ఇచ్చేశారు.

**యుద్ధాన్ని నేను ముగిస్తా :** ఇది చాలా కీలకమైన ప్రకటనగానే చూడాలని అంటున్నారు. యుద్ధాన్ని మీరు మొదలెట్టారు, నేను ముగిస్తాను అని ప్రొఫెసర్ చేసిన తాజా వ్యాఖ్యలతో వ్యవహారం



ఇంకా ముదిరి పాకాన పడేలా ఉందని అంటున్నారు. ఎందుకంటే ప్రొఫెసర్ పట్టుదల ఆయన నిబద్ధత గురించి మరో వైపు చర్చ సాగుతోంది. ఆయన ఒక ఇష్యూ మీద మాట్లాడినపుడు ఎంతో స్టడీ చేసి కానీ మీడియా ముందుకు రారని అంటారు. ఆయన చెప్పే ప్రతీ విషయం మీద గణాంకాలతో కూడిన పక్కా మ్యాటర్ ఉంటుందని కూడా అంటారు. అలాంటిది ఆయన ఇంత పెద్ద విషయాన్ని యధాలాపంగా అన్నారా అన్నది కూడా అంతా ఆలోచిస్తున్నారు. మరి ఆయనకు లీక్ చేసినది ఎవరు, ఆ పేరు చెప్పడం ఇష్టం లేకనే ఈ విధంగా సారీ చెప్పారా అన్నది కూడా చర్చిస్తున్నారు. ఇవన్నీ పక్కన పెడితే తాను ఇష్యూ క్లోజ్ అని చెప్పి సారీ చెప్పాక కూడా రాద్ధాంతం చేస్తూ తన వ్యక్తిత్వాన్ని హననం చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని ప్రొఫెసర్ నాగేశ్వర్ బిగ్ సౌండ్ చేస్తున్నారు.

**నేను పేటీఎం అయితే :** తానే పేటీఎం అయితే జగన్ కంటే ముందు చంద్రబాబే తనకు కొనేవారు కదా అని ప్రొఫెసర్ ఒక లాజిక్ తో కూడిన ప్రశ్న వేశారు. ఇది పోటీ రాజకీయ ప్రపంచం. పైగా అన్ని విషయాల్లో జగన్ కంటే ముందే చంద్రబాబు ఉంటారు, కాబట్టి బాబు ఈ చాన్స్ వదిలేసుకుంటారా అని ఆయన ప్రశ్నించారు. ఇక గతంలో ఎన్టీఆర్ ట్రస్ట్ లో జరిగిన ఒక కార్యక్రమానికి తనను జ్యూరీగా ఆహ్వానించారు అని తాను పేటీఎం అయితే ఆహ్వానించేవారేనా అని ఆయన ప్రశ్నించారు. పవన్ కళ్యాణ్ ప్రత్యేక హోదా విషయం మీద రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించినపుడు తెలంగాణాకు చెందిన తన ఒక్కరినే దానికి పిలిచారని మరి పేటీఎం అని అనుకుంటే ఎందుకు పిలుస్తారు అని మరో ప్రశ్న వేశారు.

**సహనం నశించింది అంటూ :** తన సహనం నశించింది అని ప్రొఫెసర్ అన్నారు. తాను 2009లో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ ప్రస్తుత తెలంగాణా రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావుని ఓడించి గెలిచి వచ్చాను అని చెప్పారు. అదే టీడీపీ మాత్రం బీజేపీ మద్దతు లేకుండా ఏ ఎన్నికలోనైనా గెలిచిందా అని ప్రొఫెసర్ నిలదీశారు. తన సహనానికి హద్దు ఉందని ఇపుడు సోషల్ మీడియాలో తన మీద చేస్తున్న విమర్శలు టార్గెట్ చేస్తున్న వైనం చూస్తే కనుక తాను ఇక మౌనంగా ఉండేది లేదని ప్రొఫెసర్ తేల్చి చెప్పారు. తాను యుద్ధాన్ని ముగిస్తాను అంటూ ప్రొఫెసర్ చేసిన ఈ ప్రకటనలతో ఆయన వద్ద మరింత విలువైన సమాచారం ఏదైనా ఉందా దానిని ఆయన బ్లాస్ట్ చేస్తారా అన్న కొత్త చర్చ మొదలైంది. మొత్తానికి ప్రొఫెసర్ ఎపుడూ చేసే రాజకీయ విశ్లేషణలో భాగంగా గతంలో పవన్ ఢిల్లీ వెళ్ళి అమిత్ షాను కలిసిన విషయాన్ని ప్రస్తావించారని అంటున్నారు. అది ఇంత రచ్చ చేస్తుందని ఆయన కూడా బహుశా ఊహించి ఉండరని అంటున్నారు. ఏది ఏమైనా ప్రొఫెసర్ మాజీ ఎమ్మెల్యే, మేధావి, రాజకీయ శాస్త్రాన్ని వ్యూహాలను క్షుణ్ణంగా అవగాహన పట్టిన వారు. ఆయన వద్ద చాలా మ్యాటర్ అయితే ఉందని అంటున్న వారూ ఉన్నారు. సో ఏమి జరుగుతుంది అన్నది చూడాల్సి ఉంది.



# త్వరలో "మన వార్డులో మన ఆదిరెడ్డి" వార్డుల పర్యటనలు

**జూన్ 12 నుంచి వారానికి రెండు రోజులు - కార్యకర్త ఇంట్లో రాత్రికి బస... వారితో ముఖాముఖి... అధికారులతో సమీక్షలు**

**కూటమి క్యాడర్‌కు మరింత బలం : ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ - 20 లక్షల రూపాయలు సిఎంఆర్ఎఫ్ చెక్కులు 35 మందికి లబ్ధిదారులకు పంపిణీ**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్ళ పూర్తవుతున్న సందర్భంగా రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలతో పాటు కూటమి క్యాడర్‌ను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో "మన వార్డులో మన ఆదిరెడ్డి" పేరుతో వినూత్న కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ప్రకటించారు. జూన్ 12 నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో వారానికి రెండు రోజులు రెండు వార్డుల్లో పర్యటిస్తూ అధికారులతో సమీక్షలు, కార్యకర్తలతో ముఖాముఖి, కార్యకర్త ఇంట్లో బస, శానిటేషన్ పరిశీలనలు నిర్వహిస్తానని వెల్లడించారు. తిలక్ రోడ్డులోని రెడ్డీస్ కన్వెన్షన్ హాల్లో ఏర్పాటు చేసిన సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలో సిటీ నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. ఇటీవల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్వహించిన తూర్పుగోదావరి జిల్లా సమీక్ష సమావేశంలో రాష్ట్రంలోని నియోజకవర్గాల ర్యాంకింగ్‌లో రాజమహేంద్రవరం సిటీ మొదటి ఆరు స్థానాల్లో నిలిచిందని సీఎం ప్రత్యేకంగా ప్రస్తావించారని ఈ సందర్భంగా వెల్లడించారు. 2024 ఎన్నికల్లో వచ్చిన ఓటు శాతం కంటే మరో 8 శాతం ఓట్ షేర్ పెరగడం కూటమి ప్రభుత్వం చేసిన పనులపై ప్రజల్లో పెరిగిన విశ్వాసానికి నిదర్శనమన్నారు.

**ఓట్ షేర్ పెరగడానికి కారణం కూటమి క్యాడరే :**

కేవలం అభివృద్ధి కార్యక్రమాల వల్లే ఓట్ షేర్ పెరిగిందని తాను భావించడం లేదని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు పేర్కొన్నారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీల క్యాడర్ కష్టపడి పని చేయడం, నాయకత్వం సమన్వయంతో ముందుకెళ్లడం వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని అన్నారు. ఒక్కడి వల్ల రాజకీయ వ్యవస్థ నడవదని, కూటమి క్యాడర్ కృషి ఎప్పటికీ మరువలేనిదని చెప్పారు. కార్యకర్తల కష్టం, కమిట్మెంట్‌ను గుర్తించి వారికి మరింత దగ్గరయ్యే ఉద్దేశంతోనే కొత్త కార్యక్రమాన్ని రూపొందించినట్లు వెల్లడించారు.

**"మన వార్డులో మన ఆదిరెడ్డి" కార్యక్రమం విశేషాలు :**

జూన్ 12 నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో వారానికి రెండు రోజులు రెండు వార్డుల్లో పర్యటిస్తానని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా... రెండు వార్డుల మధ్య ప్రాంతంలో సమీక్ష సమావేశం, పోలీస్, మున్సిపల్, శానిటేషన్, రెవెన్యూ, వాటర్, విద్యుత్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహిస్తామన్నారు. భవిష్యత్ అవసరాలను గుర్తిస్తామన్నారు. డ్రైనేజీ, రోడ్లు, నీటి సమస్యలు, శానిటేషన్ అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకుంటామన్నారు. అధికారులు మాత్రమే కాకుండా కార్యకర్తల మాట కూడా వినిపించేలా ఈ కార్యక్రమాన్ని రూపొందించామన్నారు.

**కార్యకర్తలతో ముఖాముఖి - సంస్థాగత బలోపేతమే లక్ష్యం :**

"కార్యకర్త కింద ఉండకూడదు, నాయకుడిగా ఎదగాలి" అనే భావనతో కార్యకర్తలతో ప్రత్యేక ముఖాముఖి కార్యక్రమం నిర్వహిస్తానని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. కూటమి పార్టీల్లో ఎవరు గుర్తింపు కోల్పోయారో, ఎవరికి అవకాశాలు ఇవ్వాలో ప్రత్యక్షంగా తెలుసుకుని వచ్చే మూడు సంవత్సరాల్లో ప్రతి ఒక్కరికి గౌరవం దక్కేలా కృషి చేస్తానన్నారు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్. తెలుగుదేశం, జనసేన, బీజేపీ మధ్య క్షేత్రస్థాయిలో ఉన్న చిన్న చిన్న సమస్యలను పరిష్కరించి కూటమిని మరింత బలోపేతం చేయడమే లక్ష్యమన్నారు.

**కార్యకర్త ఇంట్లోనే బస చేస్తా :**

మన వార్డులో మన ఆదిరెడ్డి కార్యక్రమంలో భాగంగా కార్యకర్త లేదా నాయకుడి ఇంట్లో రాత్రి బస చేస్తానని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ప్రకటించారు. రాత్రి కార్యకర్తలతో భోజనం చేసి, వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి, సమస్యలు తెలుసుకుంటానన్నారు. ఉదయం శానిటేషన్ డ్రైవ్, వాటర్ సప్లై పరిస్థితులపై పరిశీలన నిర్వహిస్తానని చెప్పారు. రాజమహేంద్రవరం చరిత్రలో ఏ ప్రజాప్రతినిధి కూడా చేపట్టని విధంగా ఈ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ప్రాంతాన్ని బట్టి వ్యాపారులు, మహిళలు, డాక్టర్లు తదితర వర్గాలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు వెల్లడించారు. "మీ భద్రత మా బాధ్యత" కార్యక్రమాన్ని మరింత విస్తరించేందుకు మహిళలతో ప్రత్యేక చర్చలు చేపడతామని చెప్పారు.

**ఎన్నికల కోసం కాదు - క్షేత్రస్థాయిలో ఉండేందుకే :**

ఈ కార్యక్రమం ఓట్ల కోసం కాదని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఎన్నికలకు ఇంకా మూడు సంవత్సరాల సమయం ఉందని, ప్రజా సమస్యల పరిష్కారం, కూటమి క్యాడర్‌ను బలోపేతం చేయడానికే ఈ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. "మాకు పోటీ ఎవరూ లేరు... మాకు మేమే పోటీ" అన్న భావనతో లక్ష మెజారిటీ లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు.

**కూటమి నాయకులకు 300కు పైగా పదవులు :**

నగరంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకత్వాన్ని కలుపుకుంటూ సుమారు 300 రాజకీయ పదవులు ఇచ్చినట్లు ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు పేర్కొన్నారు. వాటిలో భాగంగా ఏపీ శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ పదవి, 9 రాష్ట్ర డైరెక్టర్ పోస్టులు, ఆర్యాపురం బ్యాంకులో 13 మంది డైరెక్టర్లు, జాంపేట బ్యాంకులో 15 మంది నాయకులకు అవకాశాలు, చాంబర్‌లో 24 మందికి గౌరవం, 14 ఎండోమెంట్స్ కమిటీల్లో 142 మందికి పదవులు, అర్బన్ హెల్త్ సెంటర్లలో చైర్మన్ పోస్టులు ఇలా అన్ని కూటమి పార్టీల నాయకత్వాన్ని సమన్వయం చేస్తూ ముందుకెళ్తున్నామని వివరించారు.

**సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.5.07 కోట్ల సహాయం :**

ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఇప్పటివరకు రూ.5,07,81,071 విలువైన 596 చెక్కులు పంపిణీ చేసినట్లు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ వెల్లడించారు. ఇంకా రూ. 2,80,00,000 విలువైన 138 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఇబ్బందుల్లో ఉన్న ప్రజలను కూటమి ప్రభుత్వం



అన్ని విధాలుగా ఆదుకుంటుందని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కొత్త పెన్షన్లు మంజూరు అవుతున్నాయని, జూన్ 12న వాటి పంపిణీ కూడా చేపడతామని ప్రకటించారు.

**పవన్ కళ్యాణ్ పర్యటన వివరాలు :**

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాజమహేంద్రవరం పర్యటనకు సంబంధించి మీడియా మిత్రులు వివరాలు అడగ్గా ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు స్పందించారు. సోమవారం పుష్కర ఘాట్ నుంచి బోటు ద్వారా కోట్లింగాల రేవు, నల్లా ఛానల్ ప్రాంతాల్లో గోదావరి కాలుష్యం, పుష్కర పనులను పరిశీలిస్తారని తెలిపారు. అనంతరం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో పుష్కర పనులపై సమీక్ష నిర్వహిస్తారని చెప్పారు.

**డిజిటల్ మహానాడు ఏర్పాట్లు :**

మే 27, 28 తేదీల్లో డిజిటల్ మహానాడు కార్యక్రమాన్ని రాజమహేంద్రవరం సిటీలో 10 క్లస్టర్లుగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి క్లస్టర్‌లో బూత్ ఏజెంట్లు, యూనిట్ ఇంచార్జులు, కుటుంబ సాధికారత సభ్యులు, రాష్ట్ర నాయకులు పాల్గొంటారని పేర్కొన్నారు. పొదుపు చర్యల్లో భాగంగా పెద్ద ఎత్తున జిల్లా మహానాడు నిర్వహించకుండా స్థానికంగా డిజిటల్ విధానంలో కార్యక్రమం చేపడుతున్నామన్నారు.

**పుష్కర ఘాట్ పనుల కాంట్రాక్టర్‌పై ఆగ్రహం :**

కొత్తగా వేస్తున్న స్టోన్స్ జారుతున్నాయని అడగ్గా కాంట్రాక్టర్ తమతో ఇష్టానుశారంగా మాట్లాడారన్న విషయాన్ని కొందరు మీడియా మిత్రులు ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు దృష్టికి తీసుకురాగా మీడియాపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంట్రాక్టర్‌పై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఇది కూటమి ప్రభుత్వం... మీడియాతో మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి... మరోసారి నోరు జారితే ఊరుకునేది లేదు" అని హెచ్చరించారు. రాజస్థాన్ నుంచి తెచ్చిన స్టోన్స్ నీరు పడితే జారుతున్నాయని జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గోదావరి మాత విగ్రహం ఎదురుగా ఫౌంటెన్ ఏర్పాటు అవసరమా అని ప్రశ్నించారు. ఈ విషయాన్ని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి దృష్టికి తీసుకెళ్లగా, ఆమె కూడా అసహనం వ్యక్తం చేశారని తెలిపారు. మీడియా సమావేశంలో ఏపీ శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, కూటమి నాయకులు మజ్జి రాంబాబు, నక్కా చిట్టిబాబు, కాశీ నవీన్ కుమార్, వర్రే శ్రీనివాసరావు, అత్తి సత్యనారాయణ, వై.శ్రీను, ఉప్పులూరి జానకీ రామయ్య, నిమ్మలపూడి గోవింద్, బుడ్డిగ రవి, కొల్లి బుజ్జి, ద్వారా పార్వతి సుందరి, తురకల నిర్మల, సయ్యద్ అప్సర్సీ, జక్కంపూడి అర్జున్, శెట్టి జగదీష్, కంటిపూడి శ్రీనివాస్, కంటిపూడి రాజేంద్రప్రసాద్, అరుగు ధన్‌రాజ్, మళ్ల వెంకటరాజు, కోసూరి చండీప్రియ, దాస్యం ప్రసాద్, ఈతలపాటి రవి, కేబుల్ మురళి, బేసరి చిన్ని, జవ్వాది విజయలక్ష్మి, మీసాల నాగమణి, బోను ఈశ్వరి, తుల్లి పద్మ, కానేటి కృపామణి, మోతా నాగలక్ష్మి, బత్తుల కిరణ్‌బాబు, విశ్వనాధ రాజు, అక్కిరెడ్డి ప్రసాద్, బాషా లిమ్రా, కోర్పు రామారావు తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికుల గోడు వినండి

**ఏఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటిపాక మధు**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** గోదావరి పుష్కరాల నేపథ్యంలో రాజమహేంద్రవరంకి పర్యటనకు విచ్చేస్తున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మా పారిశుద్ధ్య కార్మికుల గోడు వినాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాజమండ్రి పట్టణ అధ్యక్షులు తాటిపాక మధు కోరారు. ఆదివారం ఉదయం స్థానిక వెంగమాంబ కమ్యూనిటీ హాల్లో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పట్టణ విస్తృతస్థాయి సమావేశం మధు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా యూనియన్ రాష్ట్ర కార్యదర్శి అల్లం వెంకటేశ్వరరావు, కోశాధికారి రెడ్డి రమణ లు హాజరయ్యారు. ముందుగా యూనియన్ పట్టణ ప్రధాన కార్యదర్శి కాకి శారద భవిష్యత్తు ప్రణాళిక ను ప్రవేశపెట్టగా సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. ముందుగా తాటిపాక మధు మాట్లాడుతూ 2021 నుండి అప్కస్లో ఔట్సోర్సింగ్ వర్కర్ గా పనిచేస్తూ మరణించిన కుటుంబీకులకు గత మూడు నెలల నుండి పనికి వెళుతున్నారని అయితే ఇప్పటివరకు జీతాలు మంజూరు కాలేదని ఇప్పుడు కొత్తగా వారికి సొసైటీ ద్వారా ఉద్యోగం ఇచ్చి 15000 జీతం ఇచ్చే విధంగా కుట్ర జరుగుతుందని ఆయన ఆరోపించారు. మరణించిన కార్మికుడు ఆప్కాశలో పనిచేసి 21,000 సంపాదిస్తే అతను వారసుడుకు 15000 ఇవ్వడం ఇది న్యాయం కాదని ఆయన కోరారు అదే విధంగా రిక్షా కార్మికులు అనేక సంవత్సరాలకు పనిచేస్తున్న కేవలం 9000 జీతం మాత్రమే ఇస్తున్నారని వారికి 21,000 జీతం ఇవ్వాలని మధు డిమాండ్ చేశారు 60 సంవత్సరాలు పూర్తి అయిన కుటుంబీకులకు ఉద్యోగాలు ఇప్పటివరకు ఇవ్వలేదని వారికి వెంటనే ఇవ్వాలని మధు తెలిపారు.

## మన్యంలో ఉచిత వైద్య శిబిరం

**దుస్తుల పంపిణీ**




**రంపచోడవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రంపచోడవరం మండలం నూనెపల్లి గ్రామంలో మానవ హక్కుల పరిరక్షణ మరియు అవగాహన మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతంగా జరిగింది. ప్రజల ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమానికి స్థానిక గ్రామస్తుల నుంచి విశేష స్పందన లభించింది.మన్యం ప్రాంత ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై వైద్య సేవలను వినియోగించుకున్నారు. ఈ శిబిరంలో వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొని రక్తపోటు, మధుమేహం, ఎముకల సమస్యలు తదితర ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. మహిళలు, వృద్ధులు, చిన్నారులకు ప్రత్యేక వైద్య సలహాలు అందించడంతో పాటు అవసరమైన మందులు మరియు దుస్తులను ఉచితంగా పంపిణీ చేశారు. సుమారు 50 కుటుంబాలు ఈ వైద్య శిబిరం ద్వారా లబ్ధి పొందినట్లు సంస్థ అధ్యక్షులు సత్య గుమ్మాపు తెలిపారు. ఈ సందర్భంగా సత్య గుమ్మాపు, కడలి వెంకటేశ్వరా రావు, డాక్టర్ కె.ఎం. జగదీష్ నాయుడు, బిందు చౌదరి, పిచ్చుక మహేష్, పచ్చిపాల కళ్యాణి, ఆడారి దుర్గ, ఉప్పాడ మౌనిక రెడ్డి, పచ్చిపాల వీరబాబు, కర్రీ అరుణ్ కుమార్, ఏరువ మీనాక్షి రెడ్డి,గొల్లవెల్లి శ్రీనివాస్, దేవి, కొమ్మిరెడ్డి ప్రభవతి, వందన కుమార్, గుంటూరు రమణ,శ్రీ హరి తదితరులు పాల్గొన్నారు. వ్యక్తలు మాట్లాడుతూ ప్రతి వ్యక్తికి ఆరోగ్య సేవలు అందుబాటులో ఉండడం ప్రాథమిక హక్కు అని పేర్కొన్నారు. పేద మరియు వెనుకబడిన వర్గాలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. సమాజంలో ఆరోగ్య చైతన్యం పెంపొందించేందుకు ఇలాంటి సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తామని వెల్లడించారు. అదేవిధంగా హోసన్నా మినిస్ట్రీస్ పాస్టర్ జాన్ వెస్లీ జన్మదిన సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ డాక్టర్ జగదీష్ నాయుడు అభినందనలు తెలిపారు.

## విశ్వవిద్యాలయ వేసవి శిక్షణ ముగింపు ఉత్సవం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవర నగరంలో తొలి విశ్వవిద్యాలయం శ్రీపొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వేసవి శిక్షణ శిబిరం ముగింపు ఉత్సవంతో విఖ్యాత నాట్య పండితులు డాక్టర్ సప్పా దుర్గాప్రసాద్ ఆచార్యాత్వంలో ఆంధ్రనాట్యం విభాగంలో శిక్షణ పొందిన కళాకారిణీల ప్రదర్శనం అద్భుతంగా సాగింది.

పుష్పాంజలి, వినాయక కౌతం, శ్రీశైల శబ్దం, అన్నమయ్య కీర్తనను శ్రీమతి పావని శుభ,ఆరుషి దుర్గాంబికా,ఆరుషి దుర్గంబిక, డి.నవ్య శ్రీ, జయ శివ దుర్గా జాహ్నవి, ఆశ్రిత, చంద్రకళ, మోక్షిత, జోషికా సాయి, నందిత శ్రీ, జ్ఞాన అక్షర, రూప శ్రీ, నందన్‌లు ఆంధ్ర నాట్యం రసరమ్య ముగా నర్తించారు. తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య మునిరత్నం నాయుడు, రిజిస్టర్ శ్రీ శ్రీనివాస్ తదితరులు విశ్వవిద్యాలయం పక్షాన సప్పా దుర్గా ప్రసాద్ ను ఘనంగా సత్కరించారు. ఆంధ్ర నాట్యం ప్రదర్శించిన సప్పా శిష్యులు అందర్నీ ప్రశంసా పత్రాలతో, జ్ఞాపికలతో సత్కరించారు.

విభిన్న ప్రతిభావంతులకు

## ప్రత్యేక గ్రీవెన్స్ ఏర్పాటు చేయాలి

**జిల్లా వికలాంగుల సెల్ అధ్యక్షుడు ముత్యాల పోసి కుమార్ డిమాండ్**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లాలో విభిన్న ప్రతిభావంతులకు ప్రత్యేక గ్రీవెన్స్ ఏర్పాటు చేయాలి. దివ్యాంగులు హక్కుల వేదిక జాతీయ కార్యదర్శి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తూర్పుగోదావరి జిల్లా వికలాంగుల సెల్ అధ్యక్షుడు ముత్యాల పోసి కుమార్ డిమాండ్. ఇటీవల కాకినాడ జిల్లాలో. దివ్యాంగులకు కాకినాడ కలెక్టర్ కలెక్టరేట్లో ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించారు. అదేవిధంగా ఈ తూర్పుగోదావరి జిల్లాలో కలెక్టర్ వారు కూడా దివ్యాంగులకు ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించాలని. దీనివల్ల దూర ప్రాంతంలోని దివ్యాంగులు తమ సమస్యలు చెప్పు కోవటానికి వీలుగా ఉంటుందని,అలాగే కోనసీమ అంబేద్కర్ జిల్లాలో కూడా విభిన్న ప్రతిభావంతులకు ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించాలని, అలాగే కోనసీమ అంబేద్కర్ జిల్లా, తూర్పుగోదావరి జిల్లాలకు ఏ.డి కార్యాలయాలు ఉండాలని, దీనివల్ల దివ్యాంగులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఉంటుంది అని. దివ్యాంగులకు సంబంధించి ఏ సమస్యలో వచ్చిన. వెంటనే పరిష్కారం అవుతాయని. అలాగే దివ్యంగులకు బ్యాక్లాగ్ పోస్టులు భర్తీలో కూడా ఎక్కువ అవకాశాలు వస్తాయని. దివ్యాంగులకు సుదూర ప్రాంతాలు ప్రయాణం చేయకుండా సౌకర్యవంతంగా ఉంటుందని ముత్యాల పోసి కుమార్ ప్రభుత్వానికి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

## డివిఎంసి సభ్యులు అర్ధాల కుమార్‌కి సత్కారం

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లావిజిలెన్స్అండ్ మోనాటరింగ్ కమిటీ(డివిఎంసి) సభ్యుడిగా నియమితులైన అర్ధాల కుమార్ బాబును బిజెపి జాతీయ నాయకులు, ఎమ్మెల్సీ వీర్రాజు సత్కరించారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ అమలు జరిపే విధానాన్ని పరిశీలించడానికి తూర్పుగోదావరి జిల్లాలో ఏర్పాటు చేసిన డివిఎంసి కమిటీ సభ్యుడిగా బిజెపి ఎస్సీ సెల్ కు చెందిన అర్ధాల కుమార్ బాబుని సభ్యునిగా నియమించిన సందర్భంగా జరిగిన సేవా కార్యక్రమంలో ఎమ్మెల్సీ సోము వీర్రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా కుమార్ బాబు ని సత్కరించి ఎస్సీ ఎస్టీ చట్టం అమలులో శక్తి వంచన లేకుండా కృషి చేయాలని సూచించారు. ప్రధాని మోడీ ఎస్సీ ఎస్టీ కోసం అమలు




చేస్తున్న పథకాలను ముందుకు తీసుకెళ్లాలని కోరారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత డి. వి. ఎం. సి. సభ్యులు అర్ధాలకుమార్ బాబు మాట్లాడుతూ ఎంతో ప్రతిష్టాత్మమైనటువంటి డి.వీ ఎం సి సభ్యులుగా నియమించడంలో ఎమ్మెల్సీ సోము వీర్రాజు ఆశీస్సులతోనే ఈ పదవి దక్కిందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిజెపి ఎస్సీ సెల్ అధ్యక్షులు తగరం సురేష్ తదితరులు పాల్గొన్నారు.



## 'పెద్ది' సినిమాలో

# 'హల్లల్లల్లో' అంటూ అదరగొట్టేసింది..

### ఎవరీ బ్యూటిఫుల్ సింగర్?






మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటించిన 'పెద్ది' సినిమా నుంచి మూడో పాట వచ్చేసింది. 'హల్లల్లల్లో' అంటూ లిరిక్స్ తో సాగే ఈ హుషారైన సాంగ్ ఇప్పుడు సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. ముఖ్యంగా ఈ సాంగ్ లో ఒక లేడీ సింగర్ హస్కీ వాయిస్ స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచింది. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటించిన లేటెస్ట్ సినిమా పెద్ది. బుచ్చిబాబు సనా తెరకెక్కించిన ఈ విలేజ్ స్పోర్ట్స్ డ్రామలో బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ హీరోయిన్ గా నటించింది. కన్నడ స్టార్ హీరో శివరాజ్ కుమార్, మీర్జాపూర్ ఫేమ్ దివ్యేందు త్రిపాఠి, జగపతిబాబు, సత్య తదితరులు ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే అన్ని హంగులు పూర్తి చేసుకున్న పెద్ది జూన్ 04న ప్రేక్షకుల ముందుకు రానుంది. సినిమా ప్రమోషన్లలో భాగంగా ఇప్పటికే రిలీజైన సాంగ్స్ , ట్రైలర్ కు సూపర్బ్ రెస్పాన్స్ వచ్చింది. ఇక ఆదివారం (మే 24) ఉదయం 'హల్లల్లల్లో' అంటూ మరో సాంగ్ ను రిలీజ్ చేశారు మేకర్స్. ప్రస్తుతం ఈ సాంగ్ సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమన్ స్వరపరిచిన ఈ పాటకు అనంత్ శ్రీరామ్ లిరిక్స్ అందించగా... రక్షిత సురేష్ పాడింది. అలాగే జానీ మాస్టర్ కొరియోగ్రఫీ అందించారు. అయితే ఓ డిఫరెంట్ వాయిస్ తో ఈ పాట పాడిన సింగర్ రక్షిత సురేష్ పేరు కూడా ఇప్పుడు నెట్టింట మార్మోగుతుంది. కర్ణాటకలోని మైసూరుకు చెందిన రక్షిత కర్ణాటక సంగీతం, హిందూస్థానీ శాస్త్రీయ సంగీతంతోపాటు లైట్ మ్యూజిక్‌లో శిక్షణ తీసుకుంది. కన్నడలో 'రిథమ్ తధీమ్', 'లిటిల్ స్టార్ సింగర్-2009' టైటిల్ గెలిచిన ఆమె.. తమిళంలో 'సూపర్ సింగర్ 6' ఫస్ట్ రన్నరప్‌గా నిలిచింది. ఇక రక్షిత సినీ ప్రయాణం తెలుగు పాటతోనే ప్రారంభమైంది. 'ఎవడే సుబ్రహ్మణ్యం' (2015)లోని 'చల్లగాలి తాకుతున్న మేఘమైనదీ మనసిలా' అనే పాటను ఆలపించింది రక్షితనే. అలాగే 'లవ్‌స్టోరీ'లోని ముత్యాల చెమ్మ చెక్క పాటను కూడా ఈ బ్యూటిఫుల్ సింగర్ పాడింది. 'జవాన్'లోని 'రామయ్యా వస్తావయ్యా', 'ది లెజెండ్'లోని 'తొలి తొలి ఆశల ఊసులే' తెలుగు వెర్షన్స్ సాంగ్ కూడా రక్షిత గొంతు నుంచి వచ్చిందే. రక్షితకు ఏఆర్ రెహమాన్‌తో ప్రత్యేక అనుబంధం ఉంది. ఎక్కువగా ఆయన సంగీత దర్శకత్వంలోనే పాటలు పాడిందామె. రెహమాన్ సంగీతం అందించిన 'లైఫ్ ఆఫ్ ముత్తు', 'కోబ్రా', 'పొన్నియిన్ సెల్వన్', 'పొన్నియిన్ సెల్వన్ 2', 'మామన్నన్', 'ఆడు జీవితం', 'థగ్‌లైఫ్' తదితర చిత్రాల్లో రక్షిత తన గాత్రంతో ఆకట్టుకుంది. రెహమాన్ కాన్సర్ట్‌ల్లోనూ ఈ బ్యూటీ సందడి చేస్తుంటుంది. అలాగే హిప్‌హాప్ తమిళ, జీవీ ప్రకాశ్‌కుమార్, యువన్ శంకర్‌రాజా తదితర స్టార్ మ్యూజిక్ డైరెక్టర్లతోనూ రక్షిత పని చేసింది. ఇప్పుడు పెద్ది సినిమాలో ఉత్తరాంధ్ర యాసతో కూడిన 'హల్లల్లల్లో' పాటతో మరోసారి సెంటరాఫ్ అట్రాక్షన్ గా నిలిచింది రక్షిత.

# మా ఆయన బంగారం..!

### ప్రేమ, పెళ్లి గురించి అవికా ఇంట్రెస్టింగ్ కామెంట్స్



నటి అవికా గోర్ రీసెంట్ గా అగ్లీ స్టోరీ అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ సినిమా పాజిటివ్ టాక్ తో దూసుకుపోతుంది. తాజాగా ఈ ముద్దుగుమ్మ ఓ ఇంటర్వ్యూలో కొన్ని ఆసక్తికర విషయాలను పంచుకుంది అవికా. తన ఏడేళ్ల ప్రేమ వివాహం, పెళ్లి తర్వాత తన జీవితంలో వచ్చిన మార్పుల గురించి తెలిపింది నటి అవికా గోర్ రీసెంట్ గా అగ్లీ స్టోరీ అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ సినిమా పాజిటివ్ టాక్ తో దూసుకుపోతుంది. తాజాగా ఈ ముద్దుగుమ్మ ఓ ఇంటర్వ్యూలో కొన్ని ఆసక్తికర విషయాలను పంచుకుంది అవికా. తన ఏడేళ్ల ప్రేమ వివాహం, పెళ్లి తర్వాత తన జీవితంలో వచ్చిన మార్పుల గురించి తెలిపింది అవికా. బాలికా వధు వంటి సీరియల్ తో చిన్నతనంలోనే ఆమె కెరీర్ ప్రారంభమైంది. ముంబైలో పెరిగిన అవికాకు రాజస్థానీ భాషపై అవగాహన లేకపోయినా, బాలికా వధులో రాజస్థానీ పాత్రకు ఎంపికైంది. ఈ సీరియల్ విజయం ఆమెకు విశేష గుర్తింపు తెచ్చింది. ఆ తర్వాత 15 ఏళ్ల వయస్సులో ఉయ్యాల జంపాల చిత్రంతో తెలుగు తెరకు పరిచయమైంది. తాను సినిమాల్లోకి రావాలని, ప్రత్యేకించి తెలుగు చిత్రాలు చేయాలని ఎప్పుడూ అనుకోలేదని, కానీ ఇదంతా అనూహ్యంగా జరిగిందని అవికా తెలిపింది. తన కెరీర్ వేగంగా సాగిందని, బాలికా వధు, ఉయ్యాల జంపాల వంటి డ్రీమ్ రోల్స్ చిన్నతనంలోనే దక్కాయని అవికా చెప్పుకొచ్చింది. తనది ప్రేమ వివాహమని, ఏడేళ్ల నుంచి తమకు ఒకరి గురించి మరొకరికి తెలుసని తెలిపింది. తన తల్లి ఆరు నెలల్లోనే తన భర్తను ఒప్పుకున్నారని అవికా గోర్ పేర్కొంది. పెళ్లి తర్వాత తమ దాంపత్య జీవితం చాలా సంతృప్తికరంగా ఉందని, ఒకరినొకరు గౌరవించుకుంటూ, ఒకరి ఎదుగుదలకు మరొకరు మద్దతు ఇస్తూ తమ సంబంధాన్ని నిర్వహిస్తున్నామని తెలిపింది. సామాజిక మాధ్యమాల ప్రభావం తమ సంబంధంపై ఉండదని, తాము వాటికి అతీతంగా ఆలోచిస్తామని అవికా తెలిపింది. తామిద్దరూ ఒకరికొకరు చాలా సపోర్ట్ గా ఉంటామని , తమ తల్లిదండ్రుల బంధాన్ని ఆదర్శంగా తీసుకుంటామని అవికా చెప్పుకొచ్చింది. తన భర్త కార్పొరేట్ రంగంలో సీనియర్ ప్రొడక్ట్ మేనేజర్‌గా పనిచేస్తున్నారని, ఐఐఎం అహ్మదాబాద్ పూర్వ విద్యార్థి అని అవికా తెలిపింది. ఆయన బెంగళూరులో పనిచేసి ప్రస్తుతం బ్యాంకాక్‌లో స్థిరపడ్డారని. అవికా కూడా బ్యాంకాక్‌లోనే నివసిస్తున్నప్పటికీ, సినిమాల కోసం ఇండియాకు వస్తూ ఉంటాను అని చెప్పుకొచ్చింది. తమ కెరీర్లు వేర్వేరు అయినప్పటికీ, ఒకరికొకరు అర్థం చేసుకుంటూ, ఒకరి ఎదుగుదలకు మరొకరు మద్దతు ఇస్తూ తమ జీవితాన్ని సమతుల్యం చేసుకున్నట్లు తెలిపింది. తన భర్త తన వృత్తిని మాత్రమే కాకుండా, వ్యక్తిగా తనను అర్థం చేసుకుంటారని, తన పని వల్ల కాకుండా తన వ్యక్తిత్వం వల్ల తనను ప్రేమిస్తారని అవికా తెలిపింది. తన కెరీర్ ప్రయాణాన్ని తాను ఎప్పుడూ అంచనా వేయలేకపోయానని అవికా పేర్కొంది. ఏ సినిమా హిట్ అవుతుందో, ఏది ఫ్లాప్ అవుతుందో తనకు తెలియదని తెలిపింది అవికా. అలాగే భవిష్యత్తులో రాజకీయాల్లోకి ప్రవేశించడం వంటి అనూహ్య విషయాలపై కూడా ఆమె సానుకూలంగా స్పందించింది.. స్మృతి ఇరానీ వంటి వారు పార్లమెంట్‌లో నిలబడినట్లుగా, తాను కూడా అలాంటిది ఏదైనా చేయడానికి వెనుకాడనని, ఎందుకంటే తనకు ఏది ఆశ్చర్యం కలిగించదని ఆమె అన్నారు. ఏ రోజు ఏం జరుగుతుందో తన కెరీర్‌లో అంచనా వేయలేనని, కాబట్టి భవిష్యత్తు గురించి ఎక్కువగా ఆలోచించడం మానేశానని అవికా చెప్పుకొచ్చింది.

# పేరులో పొరపాటు.. కట్‌చేస్తే.. డ్రెస్సింగ్ రూంలో నవ్వులు పూయించిన ఛోటా ప్యాకెట్..

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరిగిన ఉత్కంఠభరిత పోరులో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఓపెనర్ ఇషాన్ కిషన్ 79 పరుగులతో సింహస్వప్నంలా విరుచుకుపడ్డాడు. అయితే, మ్యాచ్ ముగిసిన తర్వాత హైదరాబాద్ డ్రెస్సింగ్ రూమ్‌లో ఈ స్టార్ బ్యాటర్‌కు ఒక విచిత్రమైన పరిస్థితి ఎదురైంది. అవార్డు ప్రకటన సమయంలో జరిగిన ఒక చిన్న గందరగోళం వల్ల సహచర ఆటగాళ్లు నవ్వులు ఆపుకోలేక కిందపడి దొర్లగా, కిషన్ ముఖం చాటేయాల్సి వచ్చింది. హైదరాబాద్‌లోని ఉప్పల్ మైదానంలో మే 22న జరిగిన లీగ్ చివరి మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ బ్యాటర్లు చెలరేగిపోయారు. మొదట బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 255 పరుగుల భారీ స్కోరు బోర్డుపై ఉంచింది. అభిషేక్ శర్మ, హెన్రిచ్ క్లాసెన్‌లతో పాటు ఇషాన్ కిషన్ కేవలం 46 బంతుల్లోనే 79 పరుగులతో మెరుపు హాఫ్ సెంచరీ సాధించాడు. ట్రావిస్ హెడ్, నితీష్ కుమార్ రెడ్డి కూడా కీలక ఇన్నింగ్స్ ఆడటంతో బెంగళూరు ముందు భారీ లక్ష్యం నమోదైంది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు జట్టు 200 పరుగులకే పరిమితం కావడంతో, హైదరాబాద్ 55 పరుగుల తేడాతో ఘన విజయం సాధించి లీగ్ దశను విజయంతో ముగించింది.



డ్రెస్సింగ్ రూమ్‌లో అసలు కథ.. కిషన్ అనుకున్నదొక్కటి, అయినదొక్కటి..!

మ్యాచ్ ముగిసిన అనంతరం సన్‌రైజర్స్ హైదరాబాద్ డ్రెస్సింగ్ రూమ్‌లో ఆనాటి మ్యాచ్ అత్యుత్తమ ప్రదర్శనకారుడికి ఇచ్చే అవార్డు వేడుక జరిగింది. తాను ఆడిన మెరుపు ఇన్నింగ్స్‌కుగానూ ఆ అవార్డు తనకే దక్కుతుందని ఇషాన్ కిషన్ పూర్తి నమ్మకంతో ఉన్నాడు. కోచింగ్ సిబ్బందిలో ఒకరు విజేత పేరును ప్రకటిస్తూ 'ఇషాన్...' అని పిలవగానే, కిషన్ ఎంతో గర్వంగా, నమ్మకంతో సీట్లోంచి లేచి నిలబడ్డాడు. కానీ అక్కడే అసలైన ట్విస్ట్ ఎదురైంది. కోచింగ్ స్టాఫ్ పిలిచింది ఇషాన్ కిషన్‌ను కాదు, జట్టులోని మరో ఆటగాడు 'ఈషాన్ మలింగ'ను. ఇద్దరి పేర్ల ఉచ్చారణ ఒకేలా ఉండటంతో కిషన్ పొరబడ్డాడు. అసలు విషయం అర్థం కావడంతో ఇషాన్ కిషన్ సిగ్గుతో ముఖం దాచుకుంటూ మళ్లీ సీట్లో కూలబడ్డాడు. అతని ముఖకవళికలు చూసిన డ్రెస్సింగ్ రూమ్‌లోని మిగతా ఆటగాళ్లు, సిబ్బంది ఒక్కసారిగా పెద్ద పెట్టున నవ్వుతూ సందడి చేశారు.


**ఈషాన్ మలింగకు అవార్డు ఎందుకు దక్కిందంటే?**

ఇషాన్ కిషన్ బ్యాట్‌తో అద్భుతం చేసినప్పటికీ, బౌలింగ్‌లో ఈషాన్ మలింగ కీలకమైన పాత్ర పోషించాడు. భారీ స్కోర్లు నమోదవుతున్న ఈ మ్యాచ్‌లో మలింగ తన 4 ఓవర్లలో కేవలం 33 పరుగులు మాత్రమే ఇచ్చి వెంకటేష్ అయ్యర్, దేవదత్ పడిక్కల్ లాంటి ఇద్దరు ముఖ్యమైన బ్యాటర్ల వికెట్లు పడగొట్టాడు. ఈ ప్రదర్శన వల్లే బెంగళూరు జట్టు భారీ లక్ష్యాన్ని ఛేదించలేకపోయింది. రజత్ పటీదార్, క్రునాల్ పాండ్య 84 పరుగుల భాగస్వామ్యంతో బెంగళూరును పతనం నుంచి కాపాడారు. ఈ నవ్వుల పువ్వుల సంఘటనను పక్కనబెడితే, ప్లేఆఫ్స్ పోరులో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు ఇషాన్ కిషనే అత్యంత కీలకమైన అస్త్రం అనడంలో ఎలాంటి సందేహం లేదు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...

- భక్తి వాయిస్
- బిజినెస్ వాయిస్
- సినీ వాయిస్
- క్రైమ్ వాయిస్
- హెల్త్ వాయిస్
- కిసాన్ వాయిస్
- తీర్పు వాయిస్
- సక్సెస్ వాయిస్
- వనిత వాయిస్
- కిడ్స్ వాయిస్
- తీర్పు వాయిస్

# యార్కర్ కింగ్ కెరీర్‌లోనే చెత్త సీజన్.. 10 ఏళ్ల తర్వాత తొలిసారి ఇలా..!



భారత జట్టుకు బుమ్రా ఎంత కీలకమైన ఆటగాడో అందరికీ తెలిసిందే. అందుకే అతని శారీరక దృఢత్వాన్ని కాపాడేందుకు బీసీసీఐ సెలెక్షన్ కమిటీ చైర్మన్ అజిత్ అగార్కర్ కీలక నిర్ణయం తీసుకున్నారు. రాబోయే ఆఫ్ఘనిస్తాన్ టెస్ట్ సిరీస్‌తో పాటు వన్డే సిరీస్ నుంచి కూడా బుమ్రాకు పూర్తి విశ్రాంతి కల్పించారు. ముంబై ఇండియన్స్ వెన్నుముక, ప్రపంచ స్థాయి మేటి ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రాకు ఐపీఎల్ 2026 సీజన్ ఒక చేదు జ్ఞాపకంగా మిగిలిపోయింది. ఈ ఏడాది లీగ్ దశలో ఘోరంగా విఫలమైన బుమ్రా, తన కెరీర్‌లోనే అత్యంత పేలవమైన ప్రదర్శనను నమోదు చేశాడు. 2015 తర్వాత అతను ఈ స్థాయిలో వికెట్లు తీయలేక ఇబ్బంది పడటం ఇదే మొదటిసారి కావడం గమనార్హం.

**లీగ్ చివరి మ్యాచ్‌కు దూరం.. వాంఖెడేలో విశ్రాంతి..!**

ముంబైలోని వాంఖెడే స్టేడియంలో ఆదివారం మధ్యాహ్నం రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో జస్ప్రీత్ బుమ్రా మైదానంలోకి దిగలేదు. ఈ ప్రతిష్టాత్మక మ్యాచ్‌లో టాస్ గెలిచిన ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా తాము మొదట బౌలింగ్ చేస్తున్నట్లు ప్రకటిస్తూ, బుమ్రాకు ఈ మ్యాచ్ నుంచి విశ్రాంతి కల్పించినట్లు తెలిపాడు. బుమ్రా స్థానంలో శార్దూల్ ఠాకూర్ తుది జట్టులోకి వచ్చాడు. కాగా, ప్లేఆఫ్స్ రేసులో నిలవాలంటే రాజస్థాన్ రాయల్స్ జట్టుకు ఈ మ్యాచ్‌లో విజయం అత్యంత కీలకంగా మారింది. ఇప్పటికే పాయింట్ల పట్టికలో అగ్రస్థానాల్లో నిలిచిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, గుజరాత్ టైటాన్స్ జట్లు మే 26న క్వాలిఫయర్ 1లో తలపడనుండగా, మూడో స్థానంలో ఉన్న సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు మే 27న ఎలిమినేటర్ మ్యాచ్ ఆడనుంది.

**పరుగుల నియంత్రణ ఉన్నా.. కరువైన వికెట్లు..!**

ఐపీఎల్ చరిత్రలో ముంబై ఇండియన్స్ సాధించిన విజయాల్లో బుమ్రా పాత్ర అసాధారణమైనది. 2013లో అరంగేట్రం చేసినప్పటి నుంచి 158 మ్యాచుల్లో 187 వికెట్లు పడగొట్టి లీగ్‌లోనే అత్యుత్తమ బౌలర్‌గా గుర్తింపు తెచ్చుకున్నాడు. కానీ ఈ 19వ సీజన్ మాత్రం అతనికి ఏమాత్రం కలిసిరాలేదు. ఈ సీజన్లో తాను ఆడిన మొదటి 6 మ్యాచుల్లో బుమ్రా ఒక్క వికెట్ కూడా తీయలేకపోయాడు. మొత్తం 13 మ్యాచుల్లో కేవలం 4 వికెట్లు మాత్రమే పడగొట్టగలిగాడు. అతని పరుగుల నియంత్రణ రేటు 8.36 గా బాగున్నప్పటికీ, వికెట్లు తీయడంలో మాత్రం ఘోరంగా విఫలమయ్యాడు. అతని బౌలింగ్ సగటు కూడా 102.50 కి పడిపోయింది. గతంలో 2013, 2014, 2015 సీజన్లలో మాత్రమే బుమ్రా సింగిల్ డిజిట్ వికెట్లకు పరిమితమయ్యాడు. ఆ తర్వాత ప్రతి సీజన్లోనూ కనీసం 15 కి పైగా వికెట్లు తీస్తూ వచ్చాడు. ముఖ్యంగా 2020లో 27 వికెట్లు తీసి ముంబైకి ఐదోసారి ట్రోఫీని అందించడంలో కీలక పాత్ర పోషించాడు.

**వైఫల్యానికి అసలు కారణం ఇదేనా..?**

బుమ్రా ఫామ్ కోల్పోవడం వెనుక ఉన్న కారణాలను ముంబై ఇండియన్స్ ప్రధాన కోచ్ మహేల జయవర్ధనే విశ్లేషించారు. ఇటీవల ముగిసిన టీ20 ప్రపంచకప్ 2026 టోర్నమెంట్‌లో బుమ్రా చిన్న చిన్న శారీరక ఇబ్బందులతో ఆడాడని, ఆ ప్రభావం ఐపీఎల్‌పై పడిందని పేర్కొన్నారు. ప్రపంచకప్ ఒత్తిడి, శారీరక అలసట కారణంగానే అతను తన పాత లయను అందుకోలేకపోయాడు. పైగా వెన్నునొప్పి సమస్యలు ఉన్నప్పటికీ దేశం కోసం నిరంతరం ఆడుతున్న బుమ్రా, ఈ సీజన్లో ఏకంగా ఏడు నో-బాల్స్ వేసి అత్యధిక నో-బాల్స్ వేసిన బౌలర్‌గా నిలిచాడు. దీన్నిబట్టి అతను రనప్ సమస్యలతో ఎంతగా ఇబ్బంది పడ్డాడో అర్థం చేసుకోవచ్చు. ప్రపంచకప్ ముగిసిన వెంటనే ఐపీఎల్‌లోకి రాకుండా కొన్ని మ్యాచులకు విశ్రాంతి తీసుకుని ఉంటే బాగుండేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. భారత జట్టుకు బుమ్రా ఎంత కీలకమైన ఆటగాడో అందరికీ తెలిసిందే. అందుకే అతని శారీరక దృఢత్వాన్ని కాపాడేందుకు బీసీసీఐ సెలెక్షన్ కమిటీ చైర్మన్ అజిత్ అగార్కర్ కీలక నిర్ణయం తీసుకున్నారు. రాబోయే ఆఫ్ఘనిస్తాన్ టెస్ట్ సిరీస్‌తో పాటు వన్డే సిరీస్ నుంచి కూడా బుమ్రాకు పూర్తి విశ్రాంతి కల్పించారు. సుదీర్ఘ విరామం తర్వాత అతను ఇంగ్లాండ్‌తో జరిగే వన్డే సిరీస్ ద్వారా మళ్లీ టీమిండియా జర్సీలో మైదానంలోకి అడుగుపెట్టనున్నాడు. ఈ విశ్రాంతి మన స్టార్ బౌలర్ మళ్లీ ఫామ్‌లోకి రావడానికి ఎంతగానో దోహదపడుతుందని ఆశిద్దాం.

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com